

ఎన్నికల హామీల అమలుకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా బలంగా, సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నారు. వేద కుటుంబాలకు భరోసా, భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 28.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 217 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

పరిశ్రమలకు భారీ ఊతం





- పరిశ్రమలు, అమరావతి, విద్యుత్ రంగాలకు కేబినెట్ ఆమోదాలు
- రూ.19 వేల కోట్లతో కియా రెండో ప్లాంట్
- ఆరు సంస్థల భారీ పెట్టుబడులకు పచ్చజెండా
- అమరావతి సచివాలయ నిర్మాణ వ్యయం రూ.6,641 కోట్లకు పెంపు
- రూ.2,000 కోట్లకు పైగా కీలక నిర్మాణ ప్రతిపాదనలు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడం, భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడం, రాజధాని అమరావతి నిర్మాణాలను వేగవంతం చేయడం, విద్యుత్ రంగంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను చేపట్టడం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు మూడు గంటలపాటు వర్చువల్‌గా జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన 30 అంశాల అజెండాకు ఆమోదం లభించింది. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించడం, పెట్టుబడులకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, రాజధానిలో ప్రభుత్వ భవనాలు, ప్రజా సౌకర్యాల నిర్మాణాలకు నిధులు కేటాయించడం, పునరుత్పాదక విద్యుత్ రంగాన్ని విస్తరించడం వంటి అంశాలకు మంత్రివర్గం ప్రాధాన్యం ఇచ్చింది.

ఎంఎస్ఎంఈలకు సులభతర అనుమతులు : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సులభతరమైన అనుమతులు కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టూ బిజినెస్ బిల్లు-2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. పరిశ్రమల స్థాపనలో అనుమతుల ప్రక్రియను సరళీకరించి, పారిశ్రామికవేత్తలకు తక్కువ సమయంలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం కల్పించేందుకు ఈ బిల్లులో పలు నిబంధనలు రూపొందించారు. స్వీయ ధ్రువీకరణ విధానం, నిర్దిష్ట కాలవ్యవధిలో అనుమతుల మంజూరు, సాధారణ తనిఖీల నుంచి రక్షణ వంటి అంశాలను ఇందులో పొందుపరిచారు.

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ, భూ కేటాయింపులు, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్స్ కార్పొరేషన్ భూ కేటాయింపు, ధరల విధానానికి ఆమోదముద్ర వేసింది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను పారదర్శక విధానంలో కేటాయించడం, పెట్టుబడిదారులకు అనుకూల పరిస్థితులు కల్పించడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. శ్రీకాకుళం జిల్లా మూలపేటలో భవ్య రసాయన్ పథకం కింద గ్రీన్‌ఫీల్డ్

• వివరాలు 2 లో



లోక్‌సభకు భారీ విస్తరణ

- 850కి ఎంపీ స్థానాల పెంపునకు ప్రతిపాదన
- 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ల అమలు లక్ష్యం
- లోక్‌సభ, శాసనసభల్లో 33 శాతం కోటా
- వచ్చే వారం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు
- దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్య నష్టం లేకుండా సవరణలు

న్యూఢిల్లీ, నవంబర్ 27 (జర్నలిస్ట్ ఫైల్) : డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సేవా తీర్థ్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు వెల్లడించాయి. డీలిమిటేషన్ అనంతరం ఏ రాష్ట్రానికీ లోక్‌సభ సీట్ల ప్రాతినిధ్య నిష్పత్తిలో నష్టం కలగకుండా బిల్లులో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. వచ్చే వారం నిర్వహించనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో సవరించిన రాజ్యాంగ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలను గరిష్టంగా 850 వరకు పెంచే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మిగతా 2లో...

డీలిమిటేషన్‌కు మద్దతు

- లోక్‌సభ స్థానాలు 50శాతం పెంపుతో అందరికీ ప్రయోజనం
- అన్నిపార్టీలు కలిసి రావాలి
- 2029 ఎన్నికల నాటికి పునర్విభజన జరగాలి

ఢిల్లీ, నవంబర్ 27 (జర్నలిస్ట్ ఫైల్) : మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంటు స్థానాలను పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. ఈ కీలక నిర్ణయాలకు మద్దతు తెలిపేందుకే ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఇతర కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. మిగతా 2లో...



పట్టణాల్లో ఓటు జోరు

23 పట్టణ స్థానిక సంస్థల్లో 63.44 శాతం పోలింగ్

పాదిలిలో అత్యధికంగా 77.90 శాతం

నవంబర్ 30న ఓట్ల లెక్కింపు

2 లో

వైకుంఠ ద్వారాలకు వేళాయె

- డిసెంబర్ 20 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు
- టికెట్ల విడుదల షెడ్యూల్ ప్రకటించిన టీటీడీ
- నేటి నుంచి ఆన్‌లైన్ టికెట్ల జారీ..
- తొలి రెండు రోజులు సామాన్య భక్తులకు ప్రాధాన్యం

2 లో

మత్స్యకారుల భద్రతే ముఖ్యం



- నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తప్పవు
- 80 శాతం బోట్లకు ట్రాన్స్‌పాండర్ల ఏర్పాటు
- మిగిలిన వాటికీ త్వరితగతిన అమర్చాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ బీమా రక్షణ
- అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు : అచ్చెన్నాయుడు

8 లో

పరోక్ష ఎన్నికలకు ముహూర్తం ఖరారు

- డిసెంబరు 5న డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎంపిక
- నవంబరు 30న ఓట్ల లెక్కింపు
- నర్సీపట్నం, మాచర్లకూ ఎన్నికలు
- అనివార్యమైతే 6న పోలింగ్ ప్రక్రియ

విజయవాడ, నవంబర్ 27 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మిగతా 3లో...

ఏపీ వైద్య విధానానికి కేంద్రం కితాబు



- ప్రజాభిప్రాయంతో వైద్య సేవల్లో మార్పులు
- 18 ఏళ్లు దాటిన వారికీ ఎన్‌సీడీ పరీక్షలు
- గిరిజన గర్భిణులకు ప్రత్యేక నిరీక్షణ వసతులు
- 23 ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల పరిశీలన

అమరావతి, నవంబర్ 27 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించి, వారి సూచనలు, సమస్యల ఆధారంగా సేవల్లో మార్పులు తీసుకొస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విధానాన్ని కేంద్ర వైద్య బృందాలు ప్రశంసించాయి. ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యమిస్తూ వైద్య సేవలను మెరుగుపరిచే విధానం అభినందనీయమని పేర్కొన్నాయి. ఈ విధానం అమలు తీరుకు సంబంధించిన మిగతా 3లో...

దక్షిణాది అడ్వెంచర్ హబ్‌గా గండికోట

- నిమాస్‌తో కీలక ఒప్పందం
- జనవరి 6 నుంచి పారామోటార్ కోర్సు
- యువతకు శిక్షణ.. ఉపాధికి బాటలు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో సాహస పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ గండికోటను దక్షిణ భారతదేశంలో ప్రముఖ అడ్వెంచర్ ట్రైనింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్), గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ మధ్య శుక్రవారం రాష్ట్రసచివాలయంలో అవగాహన మిగతా 3లో...

తుపాన్లకు చెక్ పెట్టే విద్యుత్ వ్యవస్థ

- రూ.4,851 కోట్లతో తీర ప్రాంత నెట్‌వర్క్ పటిష్టీకరణ
- 90 శాతం నిధులు ఇవ్వాలని కేంద్రానికి గొట్టిపాటి విజ్ఞప్తి



ఢిల్లీ, నవంబర్ 27 (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో తుపానులను తట్టుకునేలా విద్యుత్ పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు రూ. 4,851 కోట్ల ప్రత్యేక ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక సహకారం అందించాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వివిధ రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన, మిగతా 3లో...

ఎర్రదొంగలపై మెరుపుదాడి

ఐదు ప్రాంతాల్లో ఏకకాలంలో అటవీశాఖ ఆపరేషన్

114 ఎర్రచందనం దుంగలు, ఏడు వాహనాలు స్వాధీనం

ముగ్గురు అరెస్ట్.. అంబులెన్స్‌ల్లోనూ తరలింపు

స్మగ్లర్లకు వణుకు పుట్టించాలి : పవన్ కల్యాణ్

3 లో

నేడు రాజమహేంద్రవరానికి సీఎం

- జిల్లా కోర్టుకు 222 ఏళ్లు..
- బార్ అసోసియేషన్‌కు 131 ఏళ్లు
- రెండు సంస్థల వార్షికోత్సవాల్లో పాల్గొననున్న చంద్రబాబు



8 లో

లోక్‌సభకు భారీ విస్తరణ



(మొదటి పేజీ తరువాయి)

పెంచిన స్థానాల సంఖ్యను 25 ఏళ్ల పాటు, అంటే 2051 వరకు కొనసాగించేలా రాజ్యాంగ సవరణల్లో మార్పులు చేసినట్లు సమాచారం. రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య సమతుల్యతను కాపాడటం, డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవడం ఈ మార్పుల వెనుక ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.

2029 ఎన్నికల నాటికి పార్లమెంట్‌తో పాటు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న లక్ష్యంతో కేంద్రం చర్యలు చేపడుతోంది. ఇందుకు అనుగుణంగా లోక్‌సభ స్థానాల పెంపు, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును రూపొందించినట్లు సమాచారం. గతంలో డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో తగిన సంఖ్యాబలం లేక ఆమోదం పొందలేకపోయిన నేపథ్యంలో, ఈసారి బిల్లుకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం వ్యూహాత్మకంగా సవరణలు చేపట్టినట్లు తెలుస్తోంది.

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుత లోక్‌సభ సభ్యుల సంఖ్య 543 ఆధారంగా లెక్కిస్తే 361 మంది సభ్యుల మద్దతు అవసమవుతుంది. ఈ నేపథ్యంలో వివిధ పార్టీల మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. డీఎంకే, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం), బీఆర్ఎస్, వైసీపీ తదితర పార్టీల మద్దతు లభించే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన కొందరు ఎంపీలు కూడా బిల్లుకు అనుకూలంగా నిలవవచ్చన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే విపక్ష ఇండియా కూటమి ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అడ్డుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది. బిల్లుపై తమ వైఖరిని ఖరారు చేసేందుకు కూటమి నేతలు సమావేశం కానున్నారు. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. నవంబర్ 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు జరగనున్నాయి. ఈ ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లులపై జరిగే చర్చలు, వివిధ పార్టీల వైఖరులు దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది.

వైకుంఠ ద్వారాలకు వేళాయె



తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి టీటీడీ కీలక ప్రకటన చేసింది. డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. దర్శన టికెట్లు, సర్వదర్శనం టోకెన్ల విడుదలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. భక్తుల సౌకర్యార్థం వివిధ దర్శన కోటాల టికెట్లను దశలవారీగా ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

శ్రీవాణి దర్శన టికెట్ల కోటాను నవంబర్ 28న ఉదయం 10 గంటలకు, రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను నవంబర్ 30న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవారి ఆలయ దాతలకు సంబంధించిన దర్శన టికెట్ల కోటాను డిసెంబర్ 8న ఉదయం 10 గంటలకు అందుబాటులో ఉంచనున్నట్లు టీటీడీ తెలిపింది.

వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పించేందుకు డిసెంబర్ 20, 21 తేదీల స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లను ఈ-డిప్ విధానంలో కేటాయించనుంది. డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ-డిప్‌లో నమోదు చేసుకున్న వారికి డిసెంబర్ 7న మధ్యాహ్నం 3 గంటలకు టోకెన్లు కేటాయించనున్నారు.

వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా సాధారణ వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. అలాగే డిసెంబర్ 20, 21 తేదీల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా నిలిపివేయనుంది. సామాన్య భక్తులకు ఎక్కువ సంఖ్యలో దర్శన అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపింది. భక్తులు టికెట్ల విడుదల తేదీలు, ఈ-డిప్ నమోదు గడువులను గమనించి ముందుగానే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించింది.

పట్టణాల్లో ఓటు జోరు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో రెండో దశ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 63.44 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని 1,009 వార్డులకు గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. పోలింగ్ శాతం వివరాలను శుక్రవారం విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో మొత్తం 24,98,312 మంది ఓటర్లకు గాను 15,85,031 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నవంబర్ 30న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపింది. ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఓటర్లు, ఎన్నికల సిబ్బంది, పోలీసు శాఖకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ శాతంలో పొదిలి ముందంజలో నిలిచింది. మార్కాపురం జిల్లా పొదిలిలో 77.90 శాతం పోలింగ్ నమోదవగా, ప్రకాశం జిల్లా కందుకూరులో 76.67 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో 75.20 శాతం, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో 74.65 శాతం, బాపట్లలో 70.78 శాతం పోలింగ్ నమోదైంది.

అత్యల్ప పోలింగ్ శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో నమోదైంది. అక్కడ 54.67 శాతం ఓటర్లు మాత్రమే ఓటు వేశారు. తాడిగడపలో 56.37 శాతం, గూడూరు (నెల్లూరు)లో 56.66 శాతం పోలింగ్ నమోదైంది. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో 57.01 శాతం, కాకినాడ కార్పొరేషన్‌లో 58.59 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నవంబర్ 30న జరిగే ఓట్ల లెక్కింపు అనంతరం 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో ఆయా పట్టణాల్లో రాజకీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

పరిశ్రమలకు భారీ ఊతం

(మొదటి పేజీ తరువాయి)

కెమికల్ పార్కు ఏర్పాటుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఆరు సంస్థల భారీ పెట్టుబడులకు ఆమోదం : సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు సంబంధించి ఆరు కీలక ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. ఈ పెట్టుబడుల ద్వారా ఆటోమొబైల్, గ్లాస్ తయారీ, టైటానియం, టైర్ల తయారీ, వస్త్ర పరిశ్రమ, ఆహార ఉత్పత్తుల రంగాల్లో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించనున్నాయి.

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం ఎర్రమంచిలో కియా ఇండియా రెండో సమగ్ర ఆటోమొబైల్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. రూ. 19 వేల కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 12 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి కీలక కేంద్రంగా ఉన్న పెనుకొండ ప్రాంతంలో మరో భారీ ప్లాంట్ ఏర్పాటు కావడం పారిశ్రామిక కార్యకలాపాల విస్తరణకు దోహదపడనుంది.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో సెయింట్ గోబైన్ సంస్థ రూ. 1,800 కోట్ల పెట్టుబడితో ఫ్లోట్ గ్లాస్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. రోజుకు 1,200 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ పరిశ్రమను అభివృద్ధి చేయనున్నారు. గ్లాస్ తయారీ రంగంలో అధునాతన సాంకేతికతతో కూడిన ఉత్పత్తులకు ఈ ప్లాంట్ కీలకంగా నిలవనుంది.

శ్రీకాకుళం జిల్లాలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ. 13,667 కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా 765 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రతిపాదించారు. టైటానియం ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక అవకాశాలను అందించనుంది.

అచ్యుతాపురం ఏపీఎస్ఈజెడ్‌లో ఏటీసీ టైర్స్ సంస్థ రూ. 1,047.47 కోట్లతో కార్ల రేడియల్ టైర్ల తయారీ సామర్థ్యాన్ని విస్తరించనుంది. చిత్తూరు జిల్లాలో ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ రూ. 266 కోట్లతో వస్త్ర, గార్మెంట్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఈ పరిశ్రమ ద్వారా 3,103 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. అదే జిల్లాలో న్యూట్రిక్రీమ్స్ సంస్థ రూ. 228.27 కోట్ల పెట్టుబడితో ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది.

ఈ సంస్థలకు అవసరమైన ప్రత్యేక ప్రోత్సాహకాలు, విద్యుత్ సరఫరా, రహదారులు, పారిశ్రామిక నీటి సదుపాయాలు తదితర మౌలిక వసతుల కల్పనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పారిశ్రామిక పెట్టుబడుల ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు ఇవ్వడం, ప్రాజెక్టుల అమలుకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీకి పోస్టులు : ఆంధ్రప్రదేశ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ నిర్వహణకు అవసరమైన ఐదు కీలక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కార్యక్రమాల నిర్వహణ, సంస్థాగత కార్యకలాపాల బలోపేతానికి ఈ పోస్టులు ఉపయోగపడనున్నాయి.

అమరావతిలో నిర్మాణాలకు భారీ వ్యయ ప్రతిపాదనలు :



రూ.180.68 కోట్లతో గ్రీన్ వర్క్స్ ప్యాకేజీ-2

రాజధాని అమరావతిలో పర్యావరణహిత మౌలిక వసతులు, పచ్చదనం, జలవనరుల పరిసరాల అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఆర్థిక సహకారంతో రూ. 180.68 కోట్ల గ్రీన్ వర్క్స్ ప్యాకేజీ-2 చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఈ ప్యాకేజీలో భాగంగా వాగులు, కాలువల వెంబడి 48.3 కిలోమీటర్ల మేర బఫర్ ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. గ్రావిటీ కెనాల్ పరిసరాల సుందరీకరణ, శాఖమూరు పార్కు అభివృద్ధి, అమరావతి శంకుస్థాపన ప్రదేశంలో మెమోరియల్ పార్కు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులను పూర్తిచేయడంతో పాటు ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపట్టే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు.

అమరావతి హైకోర్టు భవనంలో విద్యుత్, ఎయిర్ కండిషనింగ్, అగ్నిమాపక వ్యవస్థలు, లిఫ్టులు, ప్లంబింగ్ తదితర మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ (ఎంఈపీ) పనులకు రూ. 431.79 కోట్ల కాంట్రాక్టు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. హైకోర్టు భవనానికి అవసరమైన అంతర్గత సాంకేతిక సదుపాయాలు, భద్రతా వ్యవస్థలు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల పనులను ఈ కాంట్రాక్టులో భాగంగా చేపట్టనున్నారు.

అసెంబ్లీ భవనంలోని స్పైర్, రూఫ్, ప్రధాన నిర్మాణ పనులకు సంబంధించి రూ. 379.82 కోట్ల ఎల్-1 బిడ్‌కు ఆమోదముద్ర వేసింది. అసెంబ్లీ భవనానికి సంబంధించిన ఎంఈపీ పనుల కోసం రూ. 353.51 కోట్ల అంచనా వ్యయానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ భవనం నిర్మాణంలో ప్రధాన నిర్మాణ పనులతో పాటు ఆధునిక సాంకేతిక, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఈ ప్రతిపాదనలు కీలకంగా నిలవనున్నాయి.

రాజధాని అమరావతిలో సమీకృత ఆంధ్రప్రదేశ్ సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల నిర్మాణానికి గతంలో మంజూరైన రూ. 4,688.83 కోట్ల పరిపాలనా అనుమతిని రూ. 6,641.21 కోట్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

జీపీడీ టవర్‌తో పాటు మిగిలిన నాలుగు టవర్ల నిర్మాణంలో అదనపు స్ట్రక్చరల్ స్టీల్ వినియోగం, అగ్నిప్రమాద నిరోధక పూత, ఇతర నిర్మాణ మార్పులు, సాంకేతిక అవసరాల కారణంగా నిర్మాణ వ్యయం పెరిగినట్లు ప్రతిపాదించారు. ఈ మార్పులకు అనుగుణంగా సవరించిన వ్యయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

అమరావతి పరిధిలోని 14 ప్యాకేజీల్లో గ్రామ పంచాయతీల మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 1,215.70 కోట్ల పనులకు సంబంధించిన ఎల్-1 బిడ్లను కేబినెట్ ఆమోదించింది. రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పన, నిర్మాణ పనుల అమలుకు ఈ నిధులు వినియోగించనున్నారు.

శాఖమూరులో అమరావతి సంగమం పేరుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ నిర్మాణానికి రూ. 626.13 కోట్ల ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

ఈ నిర్మాణాలకు సంబంధించిన వ్యయాన్ని పబ్లిక్ లైబ్రరీస్ శాఖ, ఏపీ హెచ్ఆర్‌డీఐ, ఏపీసీఆర్‌డీఏ సంయుక్తంగా భరించనున్నాయి. గ్రంథాలయ సదుపాయాలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పాలనకు సంబంధించిన శిక్షణ, అధ్యయన కార్యక్రమాల నిర్వహణకు ఈ సముదాయం ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నారు.

విద్యుత్ రంగంలో విస్తరణకు కీలక నిర్ణయాలు: రెవెన్యూ శాఖకు మైక్రోసాఫ్ట్ అజ్యూర్, గూగుల్ క్లౌడ్ సేవలు అందించేందుకు మూడున్నరేళ్ల కాలానికి రూ. 27.93 కోట్ల పరిపాలనా అనుమతికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ డిజిటల్ సేవలు, డేటా నిర్వహణ, సాంకేతిక మౌలిక వసతుల వినియోగానికి ఈ క్లౌడ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నంద్యాల జిల్లాలో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును ఎకోరెన్ ఎనర్జీ నుంచి జెంటారి రెన్యూపబుల్స్‌కు బదిలీ చేసేందుకు కేబినెట్ అనుమతించింది. ప్రాజెక్టు పరిధిలోని ప్రభుత్వ భూములను ఎకరాకు ఏడాదికి రూ. 31 వేల లీజుతో కేటాయించేందుకు ఆమోదం తెలిపింది.

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం పోలవరం గ్రామంలో రోజుకు 12 టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తి, పర్యావరణహిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ప్లాంట్ ఉపయోగపడనుంది.

ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమృత్ లిమిటెడ్‌లో ఎన్జీఈఎల్, నెడ్‌క్యాప్ వాటాల నిష్పత్తిని 50:50 నుంచి 51:49కి మార్చే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సంస్థాగత భాగస్వామ్యం, నిర్వహణ, ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన ఏర్పాట్లలో ఈ మార్పు భాగంగా ఉండనుంది.

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు కోల్ ఇండియా లిమిటెడ్‌తో ఏపీజెన్‌కో ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. థర్మల్, పునరుత్పాదక, అణు విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా పిట్‌హెడ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది.

ప్రతిపాదిత ప్రాజెక్టుల్లో 50 శాతం ఈక్విటీ భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం, ఇంధన రంగంలో పెట్టుబడులను పెంపొందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యంగా ఉంది. కడప జిల్లా మైలవరం మండలం ధోడియం గ్రామంలో 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టు కోసం 1,127.59 ఎకరాల భూమిని 33 ఏళ్ల లీజుకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎకరాకు ఏడాదికి రూ. 30 వేల లీజు నిర్ణయించింది. ప్రతి ఐదేళ్లకు గరిష్ఠంగా 10 శాతం వరకు లీజు పెంచే నిబంధనను కూడా ఆమోదించింది. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది.

భూ సమస్యల పరిష్కారానికి కేబినెట్ ఆమోదం :

భూ సమస్యల పరిష్కారంలో భాగంగా అనంతపురం జిల్లాలోని 13 మండలాల పరిధిలో 2,027 సర్వే నంబర్లలో ఉన్న 9,917.37 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో 4,352 మంది పట్టాదారులకు ప్రయోజనం కలగనుంది. రెవెన్యూ రికార్డుల్లో పేర్ల మార్పు, భూముల వివరాల సవరణకు అనుమతించింది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం అసైన్మెంట్‌కు సంబంధం లేని భూములకే ఈ నిర్ణయం వర్తించనుంది. భూముల హక్కులు, రికార్డుల పరిశీలన ఆధారంగా నిషేధిత జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ చేపట్టనున్నారు.

రైల్వేకోడూరు మండలంలోని తొమ్మిది రెవెన్యూ గ్రామాల్లో భూ రికార్డుల సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 5,324 మంది పట్టాదారులకు చెందిన 10,192.136 ఎకరాల విస్తీర్ణంలోని 16,033 ధ్రువీకరించిన సర్వే నంబర్లలో వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో నమోదైన 'అతుకుబడి పట్టా' వివరాలను 'జిరాయితీ పట్టా'గా మార్చేందుకు నిర్ణయించింది. ఈ సవరణ ధ్రువీకరించిన సర్వే నంబర్లకు మాత్రమే పరిమితం కానుంది. ప్రభుత్వ, అసైన్డ్, నిషేధిత లేదా వివాదాస్పద భూములకు కొత్త హక్కులు కల్పించకూడదనే షరతును విధించింది. భూ రికార్డుల్లో ఉన్న తప్పులు, వర్గీకరణ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. పరిశ్రమలు, విద్యుత్ ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి వివిధ సంస్థలకు భూ కేటాయింపుల ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. పారిశ్రామిక పెట్టుబడులకు అవసరమైన భూములు, విద్యుత్, రహదారులు, నీటి సదుపాయాలు తదితర మౌలిక వసతులను సమకూర్చడం ద్వారా ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పరిశ్రమల విస్తరణ, రాజధాని నిర్మాణాలు, విద్యుత్ ప్రాజెక్టులు, భూ సమస్యల పరిష్కారం.. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే పలు కీలక ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం లభించింది.

డీలిమిటేషన్‌కు మద్దతు

(మొదటి పేజీ తరువాయి)



మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల అంశం ఇప్పుడు కీలక దశకు చేరుకుందని చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చారిత్రాత్మకమని అభివర్ణించారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారని, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని చెప్పారు. ఇప్పుడు రాజకీయ రంగంలోనూ వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు. మహిళా సాధికారతకు సామాజిక, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి వివరించారు.

జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెరగాలి : 1971 జనాభా లెక్కల ఆధారంగా 1976లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిందని, ఆ తర్వాత కూడా పాత జనాభా ప్రాతిపదికనే లోక్‌సభ స్థానాల సంఖ్య కొనసాగుతోందని చంద్రబాబు వివరించారు. అప్పట్లో దేశ జనాభా 58.8 కోట్లుగా ఉండగా, లోక్‌సభలో 543 స్థానాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం దేశ జనాభా సుమారు 147 కోట్లకు చేరుతున్న నేపథ్యంలో అదే 543 స్థానాలతో కొనసాగడం సమంజసం కాదన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా పెరగాలని అభిప్రాయపడ్డారు. 1971లో ప్రతి పది లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సుమారు 27 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచితే ప్రతి 18 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల సమస్యలను పార్లమెంటులో సమర్థంగా ప్రస్తావించేందుకు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని విస్తరించేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు.

జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు గతంలో దేశానికి ఆదర్శంగా నిలిచాయని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కుటుంబ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి, ప్రచార కార్యక్రమాల ద్వారా సంతానోత్పత్తి రేటును తగ్గించగలిగామని వివరించారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయని, జనాభా నియంత్రణతో పాటు జనాభా నిర్వహణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు తక్కువగా ఉన్న నేపథ్యంలో 2026 జనాభా లెక్కలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే ఈ రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో నష్టపోకూడదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి రాష్ట్రంలోనూ ప్రస్తుతం ఉన్న స్థానాలపై 50 శాతం అదనపు సీట్లు పెంచే విధానం తీసుకురావడం సముచితమన్నారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు కూడా పూర్తి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ప్రజల్లో అనవసరమైన అసంతృప్తి, ఆందోళనలు తలెత్తకుండా, అన్ని ప్రాంతాలకు సమాన న్యాయం జరిగేలా డీలిమిటేషన్ ప్రక్రియ ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఏపీకి 25 నుంచి 38 స్థానాలు : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని, 50 శాతం సీట్ల పెంపు జరిగితే ఆ సంఖ్య 38కి చేరుతుందని చంద్రబాబు వివరించారు. తమిళనాడులో 59, కర్ణాటకలో 42, తెలంగాణలో 26, కేరళలో 30కి లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాల సంఖ్య 195కు చేరుతుందని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడటంతో పాటు దేశవ్యాప్తంగా ప్రజాప్రాతినిధ్యం విస్తరిస్తుందని చెప్పారు. 2001 నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కూడా జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెరగలేదని, ప్రస్తుతం ప్రతి ఎంపీపై అధిక జనాభా భారం ఉందని వివరించారు. కొత్త డీలిమిటేషన్ ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సిన అవసరం ఉందని, మహిళా రిజర్వేషన్ల అమలుకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు ఎన్టీఆర్ పునాది : మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని చంద్రబాబు గుర్తుచేశారు. 1986లోనే స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి రాజకీయాల్లో వారి భాగస్వామ్యానికి పునాది వేశారని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేశానన్నారు. నేడు రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు 'స్వయం' బ్రాండ్‌ను తీసుకొచ్చామని, వాటిని అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. విద్య, ఉద్యోగాల్లో మహిళలకు అవకాశా

పరోక్ష ఎన్నికలకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 26న నిర్వహించిన ఫేజ్-II సాధారణ ఎన్నికల పోలింగ్ పూర్తికాగా, నవంబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన చేపట్టనున్నట్లు వెల్లడించింది.

నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ల ఎన్నికలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నికలను డిసెంబర్ 5న నిర్వహించాలని నిర్ణయించింది. గతంలో ఈ నెల 23, 24 తేదీల్లో జరగాల్సి ఉండి వాయిదా పడిన నర్సీపట్నం, మాచర్ల మున్సిపాలిటీల వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను కూడా తాజా షెడ్యూల్‌లో చేర్చింది. పరోక్ష ఎన్నికలకు సంబంధించిన నోటీసులను డిసెంబర్ 1లోపు జారీ చేయాలని ఆదేశించింది. అనివార్య కారణాలతో డిసెంబర్ 5న ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడితే డిసెంబర్ 6న చేపట్టాలని స్పష్టం చేసింది.

మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ల ఎన్నికలను మేయర్, వార్డు సభ్యులు, ఎక్స్-అఫీషియో సభ్యుల ద్వారా చేతులెత్తే విధానంలో నిర్వహించనున్నారు. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నికలు చైర్‌పర్సన్, వార్డు సభ్యులు, ఎక్స్-అఫీషియో సభ్యుల భాగస్వామ్యంతో ఇదే విధానంలో జరగనున్నాయి. సంబంధిత చట్టాలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నియమితులైన ప్రిసైడింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది.

పరోక్ష ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని వర్గాలు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కోరారు.

ఎర్రదొంగలపై మెరుపుదాడి



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : ఎర్ర చందనం దొంగలు దుంగ వైపు చూడాలంటే వెన్నులో వణుకు రావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అక్రమ రవాణా ముఠాలకి ఉన్న అన్ని దారులూ మూసుకుపోయేలా ఆపరేషన్స్ నిర్వహించాలని యాంటి రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్, అటవీశాఖ అధికారులకు సూచించారు. వైఎస్ఆర్ కడప డివిజన్ పరిధిలో శుక్రవారం అటవీశాఖ అధికారులు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో సుమారు 114 దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో పాల్గొన్న కడప జిల్లా అటవీశాఖ అధికారి, వారి సిబ్బందిని పవన్ కళ్యాణ్ అభినందించారు. సమన్వయంతో, వ్యూహాత్మకంగా పనిచేసి అక్రమ రవాణాను గుర్తించి, నిందితులను పట్టుకున్నారని పేర్కొన్నారు. ఆపరేషన్ కి సంబంధించిన వివరాలు అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

టాస్క్ ఫోర్స్ కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వైఎస్ఆర్ కడప డివిజన్ పరిధిలో పలు మార్గాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు, గాలింపు చర్యలు చేపట్టగా, సినిమా ఫక్కీలో అంబులెన్స్‌లు, కారుల్లో తరలిస్తున్న ఎర్ర చందనం దుంగలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. అక్రమ రవాణాకి పాల్పడుతున్న ముగ్గర్ని అదుపులోకి తీసుకుని, వారి నుంచి అక్రమంగా తరలిస్తున్న 114 ఎర్రచందనం దుంగలను, ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఐదు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించగా, స్వాధీనం చేసుకున్న వాహనాల్లో ఒక మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కారు, రెండు టయోటా ఇన్నోవా కార్లు, రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనంతో పాటు ఒక అంబులెన్స్ ఉన్నట్టు తెలియజేశారు. అక్రమ రవాణా వ్యవహారంలో తప్పించుకున్న ఇతర నిందితులను గుర్తించి తక్షణం అరెస్టు చేయాలని, స్మగ్లింగ్ మూలాలు తెలుసుకునే విధంగా దర్యాప్తు సాగాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. అటవీ సంపదను కొల్లగొట్టే అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దక్షిణాది అడ్వెంచర్ హబ్‌గా గండికోట



(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందం కుదిరింది. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఉన్నతాధికారుల సమక్షంలో నిమాస్ డైరెక్టర్ కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్, అకాడమీ కార్యదర్శి ఉన్నాది రఘునాథ్ రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ భాగస్వామ్యం ద్వారా యువతకు వృత్తిపరమైన అడ్వెంచర్ స్పోర్ట్స్ శిక్షణ అందించి అడ్వెంచర్ గైడ్లు, ఇన్‌స్ట్రక్టర్లు, రెస్క్యూ సిబ్బంది, అవుట్‌డోర్ లీడర్లు, పర్యాటక రంగ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తెలిపారు. 2027 జనవరి 6 నుంచి 31 వరకు గండికోటలో తొలి కంబైన్డ్ బేసిక్, ఇంటర్మీడియట్ పారామోటార్ కోర్సును నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నిమాస్ మార్గదర్శకత్వంలో గ్రౌండ్ ట్రైనింగ్, పరికరాల వినియోగం, భద్రతా ప్రమాణాలు, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్షన్‌తో శిక్షణ అందించనున్నారు.

భవిష్యత్తులో గండికోట అకాడమీని నిమాస్ అనుబంధ ప్రాంతీయ శిక్షణా కేంద్రంగా అభివృద్ధి చేసి ట్రెక్కింగ్, వైల్డర్‌నెస్ ఫస్ట్ ఎయిడ్, రాక్ క్లైంబింగ్, కయాకింగ్, వాటర్ రెస్క్యూ తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. దక్షిణాది రాష్ట్రాల యువతకు వృత్తిపరమైన సర్టిఫికేషన్, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ ఒప్పందం కీలకంగా నిలుస్తుందని నిమాస్ డైరెక్టర్, పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎవరెస్ట్ అధిరోహకులు మాలావత్ పూర్ణ, షేక్ హిమాంషా పాల్గొన్నారు.

రాష్ట్రంలో సాహస పర్యాటక అభివృద్ధితో పాటు పర్యాటక సౌకర్యాల విస్తరణకు ఏపీటీడీసీ చర్యలు చేపడుతోంది. ఆరు జిల్లాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో 42 బోట్లను నిర్వహిస్తుండగా, శ్రీశైలం రోప్‌వే, బెలూం, బొగ్రా గుహలు కూడా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ప్రయాణికుల భద్రత కోసం తొమ్మిది కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నారు. 2025-26లో ఏపీటీడీసీ రూ. 15.70 కోట్ల నిర్వహణ మిగులు సాధించడంతో పాటు ఏడాదిలో 27 లక్షల మందికి పైగా పర్యాటకులను ఆకర్షించింది. పర్యాటక సౌకర్యాల విస్తరణకు రూ. 1.40 కోట్లతో కొత్త బోట్లు కొనుగోలు చేయడంతో పాటు విశాఖపట్నంలోని మంగమారిపేటలో వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఏపీ వైద్య విధానానికి కేంద్రం కితాబు

(మొదటి పేజీ తరువాయి)



వివరాలను జాతీయ నూతన ఆవిష్కరణల పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించాయి. అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పర్యటించిన కేంద్ర బృందాలు మొత్తం 23 ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పలు అంశాలపై ప్రశంసలు, సూచనలు చేశాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, కేంద్ర ప్రభుత్వ పరిశీలకుడు దీపక్ సోనీ పర్యవేక్షణలో, జాతీయ ఆరోగ్య వ్యవస్థల వనరుల కేంద్రం సలహాదారు మోనా గుప్తా నేతృత్వంలో రెండు బృందాలు ఈ జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టాయి. పరిశీలనలో గుర్తించిన అంశాలు, సూచనలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తదితర అధికారులకు వివరించాయి. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నివేదికను అందజేశాయి.

రాష్ట్రంలో 18 ఏళ్ల పైబడిన వారందరికీ అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) గుర్తింపు పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని కేంద్ర బృందం ప్రత్యేకంగా అభినందించింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం 30 ఏళ్ల పైబడిన వారికి ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా, రాష్ట్రంలో తక్కువ వయస్సు నుంచే పరీక్షలు చేపట్టడం ముందస్తు వ్యాధి గుర్తింపునకు దోహదపడుతుందని పేర్కొంది. ఈ పరీక్షల ఫలితాలు, తదుపరి వైద్య సేవలు, ఇతర వివరాలను కేంద్రానికి పంపించాలని సూచించింది. రాష్ట్రంలో పనిచేస్తున్న 26 సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలలకు సమీకృత నాణ్యతా ధ్రువీకరణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సిఫార్సు చేసింది.

తణుకు జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక శిక్షణ పొందిన నర్సుల ద్వారా 60 నుంచి 70 శాతం సాధారణ ప్రసవాలు నిర్వహిస్తున్న విధానాన్ని కేంద్ర బృందం ప్రశంసించింది. నరసాపురం ఆసుపత్రిలో పరిశుభ్రత, అల్లూరి జిల్లాలో గర్భిణులకు ప్రసవానికి ముందుగానే ఆసుపత్రుల సమీపంలో వసతి కల్పిస్తున్న విధానం, ఆశా కార్యకర్తలకు నెలకు రూ. 10 వేల గౌరవ వేతనం అందిస్తున్న అంశాలను అభినందించింది.

అల్లూరి జిల్లాలో ప్రసవ సమయం సమీపించిన గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు సమీపంలోని నిరీక్షణ వసతి గృహాలకు తరలించి నాలుగైదు రోజుల పాటు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే గర్భిణులు ప్రసవ సమయంలో ఆసుపత్రికి చేరుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులు, జాప్యాన్ని తగ్గించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని కేంద్ర బృందం పేర్కొంది. వైద్య, ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమం అమలు కావడం ప్రశంసనీయమని తెలిపింది.

రెండు జిల్లాల్లో నవజాత శిశువులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు అందుబాటులో ఉండటం, శిశువు పుట్టిన వెంటనే తల్లి వద్ద ఉంచి సంరక్షించే విధానం, ప్రసవ గదుల్లో అవసరమైన పరికరాలు, మందులు, అత్యవసర ఏర్పాట్లు మెరుగ్గా ఉన్నట్లు బృందం గుర్తించింది. పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రతి మూడు వారాలకు ఆరోగ్య కార్యకర్తల సందర్శనలు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు గురువారం ఐరన్ మాత్రల పంపిణీ, అల్లూరి జిల్లాలో టీడీ టీకాల కార్యక్రమాలను పరిశీలించింది.

రక్తహీనతతో బాధపడే గర్భిణులను ముందుగానే గుర్తించి చికిత్స అందించేలా ఆశా, ఏఎన్ఎం కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని సూచించింది. గర్భిణులు, ప్రసవానంతర తల్లులకు ఆరోగ్య సంరక్షణ, ప్రభుత్వ పథకాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడంతో పాటు టీనేజ్ గర్భధారణలను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పేర్కొంది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ప్రథమ రిఫరల్ కేంద్రాలుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వ సహాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పాడేరు ఆసుపత్రిలో తల్లీబిడ్డలకు అవసరమైన సేవలు నూతన భవనం ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని తెలిపింది.

అరకులోయ ఆసుపత్రిలో ప్రసవానంతరం తల్లులు ఉండే గదిలో గోప్యతకు తగిన ఏర్పాట్లు లేవని, ప్రసవ గదుల్లో పనిచేసే నర్సులకు అవసరమైన శిక్షణ లోపించిందని కేంద్ర బృందం గుర్తించింది. జననీ సురక్ష పథకంపై గర్భిణులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అల్లూరి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో టీనేజ్ గర్భధారణలు సుమారు 10 శాతం వరకు ఉన్నట్లు పరిశీలనలో గుర్తించింది.

తణుకు ఆసుపత్రిలో నవజాత శిశువుల ప్రత్యేక చికిత్సా విభాగంలో అందుబాటులో ఉన్న పడకల కంటే ఎక్కువ మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారని పేర్కొంది. అల్లూరి జిల్లాలో మారుమూల ప్రాంతాల నుంచి చిన్నారులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక వాహనాల కొరత ఉందని, తదుపరి ఆసుపత్రి సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రవాణా సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించింది. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కౌమార బాలబాలికల ఆరోగ్య కార్యక్రమాలు అమలులో లేవని గుర్తించింది.

క్షయ వ్యాధిగ్రస్తులకు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద కాకుండా ఏరియా ఆసుపత్రుల్లో మందులు అందిస్తున్నందున, వారు క్రమం తప్పకుండా మందులు వినియోగిస్తున్నారో లేదో పర్యవేక్షించడం కష్టమవుతోందని పేర్కొంది. పశ్చిమగోదావరి జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జననీ శిశు సురక్ష కార్యక్రమం కింద చెల్లించాల్సిన నిధులను ఖర్చు చేయకుండా వెనక్కి పంపిన అంశాన్ని కూడా గుర్తించింది.

వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, యాప్‌లలో వివరాల నమోదుకు పడుతున్న సమయాన్ని సమీక్షించాలని కేంద్ర బృందం సూచించింది. వైద్య, పారామెడికల్ సిబ్బందికి సమగ్ర శిక్షణ ప్రణాళిక రూపొందించాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు వసతి కల్పించాలని, వైద్య సేవల వివరాలను కంప్యూటర్లలో నమోదు చేసే విధానాన్ని సులభతరం చేయాలని పేర్కొంది. మందులు, వైద్య సామగ్రి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాలు, ఊపిరితిత్తుల సమస్యలను ముందుగానే గుర్తించే పరీక్షలను బలోపేతం చేయాలని సూచించింది.

వైద్య సిబ్బంది నియామకాల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడాన్ని స్వాగతించిన కేంద్ర బృందం, ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. కేంద్ర బృందాలు అందించిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు తెలిపారు.

కొనసాగుతున్న కూటమి విజయ పరంపర



అమరావతి : కూటమి విజయపరంపర కొనసాగుతోందని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థులు అద్భుత విజయాలు సాధించారని తెలిపారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు, రెండు, మూడు విడతల పంచాయతీ ఎన్నికలపై టిడిపి నేతలతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన వారికి అభినందనలు తెలిపారు. రెండు, మూడు విడత పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి మద్దతు అభ్యర్థులు విజయం సాధించాలని కోరారు. ఎన్నికను ఎన్నికగానే చూడాలని, చిన్నదైనా, పెద్దదైనా సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ ఎంత ఎక్కువ జరిగితే మెజార్టీలు అంత ఎక్కువ కూటమికి పెరుగుతాయని తెలిపారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో ఎంత కష్టపడ్డామో పంచాయతీ ఎన్నికల్లోనూ అంత కంటే ఎక్కువ కష్టపడి పని చేయాలని చెప్పారు. జనసేన, బిజెపి కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఎన్నికలు లేని నియోజకవర్గాలకు చెందిన నేతలు కూడా పంచాయతీ ఎన్నికల్లో అవసరమైన నియోజకవర్గాల్లో సేవలందించాలని చెప్పారు. ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

బలహీనంగా ఉన్న చోట గెలవాలని, బలంగా ఉన్న చోట మరింత మెజార్టీలు సాధించాలని పేర్కొన్నారు. వరుస ఓటములతో వైసిపి ప్రభుత్వంలోకి వెళ్తోందని, హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసిపి చేసే దాడులు, కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నిక ఏదైనా ప్రజల తీర్పులో మార్పులేదని ఎక్స్‌లో లోకేష్ పొందుపరిచారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలనపై అచంచల విశ్వాసం కనబరిచారని పేర్కొన్నారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమి మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఘన విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందని, ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని తెలిపారు. ఆ నమ్మకం నిలబెట్టుకునే బాధ్యత అందరిపై ఉందని, అహంకారం దరిచేరనీయొద్దని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవ్వాలని, సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీ వరకు కూటమి ప్రజా ప్రతినిధులు కొలువు కావడం రాష్ట్రాభివృద్ధికి మేలి మలుపు కానుందని పేర్కొన్నారు. సమిష్టిగా పనిచేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుదామని, సంక్షేమం - అభివృద్ధికి పాటుపడదామని కోరారు.

తుపాన్లకు చెక్ పెట్టే విద్యుత్ వ్యవస్థ



(మొదటి పేజీ తరువాయి)

అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్ర ప్రతిపాదనలను వివరించారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు గొట్టిపాటి తెలిపారు.

రాష్ట్రంలో ఇటీవల వరుసగా ప్రభావం చూపిన అర్నబ్, మురసు తుపాన్ల కారణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థకు జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. తుపాన్ల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు దెబ్బతినడంతో లక్షలాది విద్యుత్ కనెక్షన్లకు సరఫరా నిలిచిపోయిన పరిస్థితులను ప్రస్తావించారు. భవిష్యత్తులో ప్రకృతి విపత్తుల ప్రభావాన్ని తగ్గించేందుకు తీర ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన బలమైన విద్యుత్ మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

ఇందులో భాగంగా తీర ప్రాంతాల్లో భూగర్భ కేబుళ్ల ఏర్పాటు, విద్యుత్ లైన్లను స్పన్ పోల్స్‌తో పునర్నిర్మించే పనులకు రూ. 4,851 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన 10 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థిక సహకారం లభిస్తే 2027-28 నుంచి 2029-30 వరకు మూడేళ్లలో ప్రతిపాదిత పనులన్నీ పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

భూగర్భ కేబుళ్లు, స్పన్ పోల్స్‌తో విద్యుత్ పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేయడం వల్ల తుపాన్ల సమయంలో విద్యుత్ మౌలిక వసతులకు కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి పేర్కొన్నారు. సరఫరా అంతరాయాలు, సాంకేతిక నష్టాలను తగ్గించడంతో పాటు విపత్తుల అనంతరం విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని వివరించారు. ప్రతిసారీ తుపాన్లకు దెబ్బతిన్న వ్యవస్థను పునరుద్ధరించేందుకు భారీగా ఖర్చు చేయడం కంటే, ముందుగానే విపత్తులను తట్టుకునే మౌలిక వసతులను నిర్మించడం దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

విద్యుత్ శాఖ మంత్రుల సమావేశానికి హాజరైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోనూ గొట్టిపాటి రవికుమార్ సమావేశమయ్యారు. అర్నబ్, మురసు తుపాన్ల సమయంలో తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ, క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు.

న్యాయమూర్తుల నియామకాల్లో అత్యధికం ఆ ఒక్క సామాజిక తరగతికే



న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్): దేశ న్యాయవ్యవస్థల్లో న్యాయమూర్తుల నియామకాల్లోనూ, బదిలీల్లోనూ సామాజిక వైవిధ్యం, ప్రతిభ, సమగ్ర కొరవడినట్లు భారత మాజీ ప్రధానమంత్రి జస్టిస్ బిఆర్ గవాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ నియామకాలు, బదిలీల్లో ఒకే సామాజిక తరగతికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. అదే సమయంలో అణగారిన తరగతులకు, మైనార్టీలకు, మహిళలకు ప్రాధాన్యత తగ్గుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాల్సిందిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన శుక్రవారం నాడు ఒక లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌కు కూడా పంపారు. దేశ జనాభాలో ఐదు శాతం కంటే తక్కువగా ఉన్న ఒక సామాజిక తరగతికి ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం లభించిందని గవాయ్ పేర్కొన్నారు. మరోవైపు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీ వర్గాలు, మహిళలకు ఉన్నత న్యాయవ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని తెలిపారు.

2018 నుంచి హైకోర్టులకు నియమితులైన 715 మంది న్యాయమూర్తుల్లో ఎస్‌సిల నుంచి 22 మంది, ఎస్‌టిల నుంచి 16 మంది, ఒబిసిల నుంచి 89 మంది, మైనార్టీల నుంచి 37 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ గణాంకాలను 2025 మార్చిలో రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి వెల్లడించిన సమాచారాన్ని ఆధారంగా ప్రస్తావించారు. నియామకాల్లో దాదాపు మూడొంతుల మంది జనరల్ కేటగిరీకి చెందినవారేనని పేర్కొన్నారు. 2021 జనవరి నుంచి 2026 జనవరి వరకు జరిగిన నియామకాల్లో పెత్తందారి సామాజిక తరగతుల ప్రాతినిధ్యం దాదాపు 80 శాతానికి చేరగా, దేశ జనాభాలో 40 నుంచి 50 శాతం వరకు ఉన్న ఒబిసిల ప్రాతినిధ్యం 14 శాతం కంటే తక్కువగా ఉందని తెలిపారు. తాను కొలీజియంలో సభ్యునిగా, అనంతరం దాని అధ్యక్షునిగా పనిచేసిన సమయంలో అన్ని సామాజిక తరగతులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేసినట్లు గవాయ్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఒకే సామాజిక తరగతిని సంతృప్తిపరిచి, ప్రోత్సహించే విధంగా నియామకాలు జరుగుతున్నాయనే అభిప్రాయానికి బలమైన కారణాలు కనిపిస్తున్నాయని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల బదిలీలు, పదోన్నతుల్లోనూ ప్రతిభకు బదులుగా ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. కొన్ని సందర్భాల్లో చిన్న హైకోర్టులకు బదిలీ అయిన న్యాయమూర్తులకు అనంతరం ప్రముఖ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులుగా పదోన్నతులు కల్పిస్తున్నారని, ప్రతిభావంతులైన ఇతర న్యాయమూర్తులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

హిమాలయాల్లో మేఘా మరో కీలక బ్రేక్‌త్రూ

ఉత్తరాఖండ్: ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రికులకు భవిష్యత్తులో రైలు ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరిచే రిషికేశ్ - కర్ణప్రయాగ్ రైల్వే ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రుద్రప్రయాగ్ జిల్లాలో 6.59 కిలోమీటర్ల పొడవైన టన్నెల్-14 ప్రధాన సొరంగం తవ్వకాలను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) పూర్తి చేసినట్లు వెల్లడించింది. హిమాలయాల్లో క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొంటూ ఈ సొరంగాన్ని విజయవంతంగా ఛేదించింది. ఈ ఏడాది జూన్‌లోనూ జోజిల టన్నెల్ బ్రేక్‌త్రూ సాధించిన సంస్థ, తాజాగా మరో కీలక నిర్మాణ మైలురాయిని చేరుకుందని పేర్కొంది. 6.59 కిలోమీటర్ల సొరంగంలో సుమేర్‌పూర్ వైపు నుంచి 4.7 కి.మీ., మారోరా వైపు నుంచి 1.79 కి.మీ. మేర తవ్వకాలు చేపట్టి అనుసంధానించారు. వదులైన మట్టి, కొండ వాలుల అస్థిరత, భూగర్భ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రీ - ఎక్స్‌కవేషన్, మల్టీ - డ్రిఫ్టింగ్, మైక్రోపైల్స్, రాక్ బోల్ట్స్, గ్రౌటింగ్ వంటి ప్రత్యేక సాంకేతిక పద్ధతులను వినియోగించారు. నివాస ప్రాంతాల భద్రతను దృష్టిలో ఉంచుకుని నియంత్రిత బ్లాస్టింగ్, ప్రత్యేక వెంటిలేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఈ రైల్వే మార్గం పూర్తయితే బద్రీనాథ్, కేదార్‌నాథ్ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికులకు రవాణా అనుసంధానం మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం, రహదారి రద్దీ తగ్గేందుకు, పర్యాటకం, స్థానిక ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలకు ఊతం లభించే అవకాశ

పంచాయతీ టు పార్లమెంట్ మహిళలు జెండా ఎగరేసే వరకు

ఆర్థికంగా.. హార్థికంగా అండగా ఉంటా..

- పనిలోనే కాదు పదువుల్లోనూ ప్రాధాన్యత దక్కాలి..
- మన చరిత్ర ఎవరూ రాయరు.. మనమే రాసుకోవాలి..
- రాజ్యాంగం ఆమోదించుకున్న ఈ రోజే ఆడవాళ్లకు నిజమైన పండుగ..
- మనల్ని మనుషులుగా గుర్తించింది రాజ్యాంగం మాత్రమే..
- వేల ఏళ్ల పాటు ఆడవాళ్లను ఒక వస్తువుగానో, ఆస్తి గానో మాత్రమే చూశారు..
- ప్రతి ఇంట్లో మత గ్రంథంతో పాటు రాజ్యాంగం కూడా తప్పకుండా ఉండాలి..
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత





హైదరాబాద్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : మహిళలను మనుషులుగా గుర్తించింది భారత రాజ్యాంగం మాత్రమేనని.. ఆ రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న నవంబర్ 26 వ తేదీయే మనకు అసలు సిసలైన పండుగ రోజని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ రోజును మహిళలంతా ఘనంగా సెలబ్రేట్ చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం "సంవిధాన్ దినోత్సవం" సందర్భంగా టీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "మహిళలు- రాజ్యాంగం" అనే సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం మాత్రమే అన్ని హక్కులు కల్పించిందన్నారు. ప్రతి ఒక్క మహిళ తన ఇంట్లో మత గ్రంథంతో పాటు రాజ్యాంగాన్ని కూడా ఉండేలా చూసుకోవాలని కోరారు. వేల ఏళ్లుగా మహిళలను ఒక వస్తువుగానో, ఆస్తిగానో చూశారని.. కానీ రాజ్యాంగం వచ్చిన తర్వాతే మహిళలను మనుషులుగా గుర్తించారని చెప్పారు. పెళ్లికి ముందు వరకు కూడా మహిళను తండ్రి లేదా అన్న ఆస్తిగా, పెళ్లి తర్వాత భర్త, వారి కుటుంబ సభ్యుల ఆస్తిగా చూసేవారన్నారు. మహాభారతం లో ధర్మరాజు ద్రౌపదిని జూదంలో పణంగా పెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు కూడా మహిళలకు ఆమె ఇష్టంతో సంబంధం లేకుండానే మగవాళ్లు వారిపై ఆధిపత్యం చెలాయిస్తున్నారన్నారు. రాజ్యాంగం ఆమోదించుకున్న నాటి నుంచే ఈ పరిస్థితి మారిందని గుర్తుచేశారు. ఆడ, మగ అనే సంబంధం లేకుండా ఆడవాళ్లు కూడా మనుషులేనని వారికి కూడా మగవారితో సమానంగా ఓటు హక్కును కల్పించింది కూడా రాజ్యాంగమేనని చెప్పారు. రాజ్యాంగం మహిళలకే ఎక్కువ హక్కులు కల్పించిందని చెప్పారు. రాజ్యాంగం ఆమోదించుకున్న రోజు నుంచే మహిళలకు నిజమైన స్వాతంత్రం వచ్చిందన్నారు.

రాజ్యాంగం అమలు చేస్తే చాలు :

రాజ్యాంగం మహిళలకు అన్ని హక్కులు ఇచ్చినప్పటికీ దురదృష్టవశాత్తు ఆ హక్కులను వినియోగించుకునే పరిస్థితి లేకుండా చేస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా మహిళలు ఉద్యోగం చేస్తే ఆమె సంపాదన భర్తకో, తండ్రికో ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇళ్లు, స్థలం ఉన్న మహిళల సంఖ్య వేళ్లపై లెక్కపెట్టేంత మాత్రమే ఉంటుందని చెప్పారు. సినిమాల్లో గానీ, కూలీ పని లో గానీ, ఐటీ ఉద్యోగాల్లో గానీ ఎక్కడైనా సరే మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లు పనిచేసినప్పటికీ వాళ్లకు మగవాళ్లతో సమాన వేతనం ఇవ్వటం లేదని విచారం వ్యక్తం చేశారు. ఏ కులంలో, ఏ మతంలో పుట్టిన సరే ఆడవాళ్లపై వివక్ష ఉంటుందన్నారు. దళిత, బీసీ మహిళలకు ఒక విధమైన వివక్ష ఉంటే, అగ్రకులాల్లో పుట్టిన మహిళలపై ఒక విధమైన వివక్ష ఉంటుందన్నారు. ఇప్పటికీ కూడా ఆడవాళ్లకు వాళ్ల పిల్లల పేరు పెట్టే విషయంలో కూడా స్వేచ్ఛ లేదన్నారు. కమ్యూనిస్ట్ పార్టీలు కొంత మహిళ హక్కుల గురించి పోరాటం చేస్తాయని భావిస్తామని..కానీ ఆ పార్టీలో కూడా మహిళలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. మహిళ నక్సల్స్ ను కూడా చాలా ఇబ్బందులు పెట్టారన్నారు. తాము జనాభాలో సగం ఉన్నామని అందుకు తగిన విధంగా అవకాశాలు ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని చెప్పారు. మగవాళ్ల కన్నా గొప్పవాళ్లమని చెప్పటం లేదని..వాళ్లపై స్వారీ చేస్తామని కూడా మేము అడగటం లేదన్నారు. మగవాళ్లతో సమానంగా తమను చూడాలని మాత్రమే కోరుతున్నామన్నారు. అవన్నీ జరగాలంటే మన రాజ్యాంగాన్ని యధాతథంగా అమలు చేస్తే చాలన్నారు.

మన చరిత్ర మనమే రాసుకోవాలి :

ఆడవాళ్లపై ఆధిపత్యం చెలాయించేందుకు మనల్ని తక్కువ చేసి చూపారని కవిత అన్నారు. ఆధిపత్యం చెలాయించే వాళ్లు ముందు మనసు పై కొడతారన్నారు. మనకు తెలివి లేదని పదే పదే అంటూ ఆత్మన్యూనతకు గురిచేస్తారన్నారు. ఆధిపత్యం చెలాయించేందుకు ఆడవారి నోట్లో మాట ఆగదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆడవాళ్లపై మగవాళ్లు వ్యతిరేక ప్రచారం చేశారని వాటిని పట్టించుకోవద్దన్నారు. సాయుధ రైతాంగ పోరాటం సహా ఎన్నో పోరాటాల్లో పురుషులతో సమానంగా మహిళలు కూడా ఫైట్ చేశారని కానీ మహిళల పోరాటాన్ని ఎక్కడ రాయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ పోరాటంపై 21 పుస్తకాలు వస్తే అందులో 20 మగవాళ్లే రాశారని..ఎక్కడ కూడా పోరాటంలో ఆడవాళ్ల పాత్ర గురించి రాయలేదన్నారు. ఒక్కరే మహిళ రాసిన పుస్తకం ద్వారా చాకలి ఐలమ్మ పోరాటం మనకు తెలిసిందని చెప్పారు. మన చరిత్ర మనమే చెప్పుకోవాలని..లేదంటే చరిత్ర ఉండదని చరిత్ర మనకు చెబుతుందన్నారు. మనం ఆడసింహాలం మన చరిత్రను మనమే రాసుకోవాల్సిన అవసరముందన్నారు.

నాడు సాయిత్రి భాయ్ పై మురికి నీళ్లు...

నేడు మన మీద మురికి కామెంట్లు :

సమాజం కోసం పనిచేసేందుకు ముందు వచ్చే మహిళలను ఇప్పటికీ అవమానిస్తున్నారని కవిత విచారం వ్యక్తం చేశారు. ఆనాడు మహిళలకు విద్య చెప్పేందుకు కృషి చేసిన సాయిత్రి భాయ్ పూలే పై పెండ, మురికి నీళ్లు చల్లారని..నేడు రాజకీయాల చేసే మహిళలపై మురికి కామెంట్లతో దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటికి ఇప్పటికీ ఏ మార్పు లేదన్నారు. సాయిత్రి భాయ్ పూలే చదువు చెప్పేందుకు ఇల్లు ఇచ్చిన ఫాతిమా షేక్ అనే మహిళను కూడా అవమానించారని గుర్తు చేశారు. కానీ మహిళలు వీటిని పట్టించుకోని భయపడవద్దన్నారు. ఏనుగు రోడ్డుపై పోతుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. హనుమంతుడి తన బలం ఎలా తెలియదో..మహిళలకు కూడా వారి బలం తెలియటం లేదన్నారు. మనం ఎవరికీ తీసిపోమని గుర్తించాలన్నారు. ఇప్పటికీ కూడా ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ చనిపోతుంటే ఎందుకు ఏ పార్టీ మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మహిళల సమస్యలను మగవాళ్లు పట్టించుకోవటం లేదన్నారు. ఇవ్వాళే న్యూస్ పేపర్లో రెండు సంఘటనలు చూసి ఆవేదనకు గురయ్యానని ఆమె చెప్పారు. ఇంటర్ చదువుతున్న అబ్బాయి..తనకు నో చెప్పిందని అమ్మాయిని చెప్పుతో కొట్టాడని న్యూస్ లో చదివానని చెప్పారు. తనకు నో చెబితే చెప్పుతో కొట్టే అధికారం, అహంకారం వాడికి ఎక్కడ నుంచి వచ్చిందని ప్రశ్నించారు. మరో సంఘటనలో డిగ్రీ చదువుతున్న అమ్మాయి హాస్టల్ బాత్ రూమ్ లో ప్రసవించిందని చదివన్నారు. అమ్మాయికి ప్రెగ్నెన్సీ ఉన్న సంగతి హాస్టల్ సిబ్బందికి, ఆమె చదువుతున్న కాలేజ్ అధ్యాపకులకు తెలియకపోవటమేమిటనీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంటే మహిళల భద్రత విషయంలో ఈ ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే మనల్ని మనం రక్షించుకునేందుకు, మన హక్కులను సాధించుకునేందుకు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఆర్థికంగా, హార్థికంగా అండగా ఉంటా :

మహిళలు పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు జెండా ఎగిరేసేందుకు తాను హార్థికంగా, ఆర్థికంగా సాయంగా ఉంటానని కవిత భరోసా ఇచ్చారు. మహిళలకు అవకాశాలు ఇచ్చేందుకే తాను పార్టీ పెట్టానని చెప్పారు. ఇన్ని రోజులు కథ వేరు ఇప్పుడు కథ వేరన్నారు. చీరలు కట్టుకున్న మహిళలు కచేరీకి వెళ్లాల్సి ఉందని, గాజులు వేసుకున్న మహిళలు చట్ట సభల్లోకి వెళ్లాల్సిన అవసరముందన్నారు. మహిళలకు పెన్షన్లు, బంగారం, సైకిళ్లు ఇస్తామని అబద్దాలు చెప్పటం కాదు వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. మహిళలకు బ్యాంక్ ఖాతాలు, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. మహిళలు ఎవరికీ భయపడకుండా తమ మనస్సాక్షికి సమాధానం చెప్పుకుంటూ రాజకీయాల్లోకి రావాలని కోరారు.

మహిళ విభాగం పేరు తెలంగాణ రుద్రమ సేన :

రాజ్యాంగ ఆమోదించుకున్న రోజును పురస్కరించుకొని తెలంగాణ రక్షణ సేన మహిళ విభాగం పేరును తెలంగాణ రుద్రమ సేనగా నామకరణం చేస్తున్నామని కవిత ప్రకటించారు. తెలంగాణ రుద్రమ సేన పోస్టర్ ను మహిళా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రుద్రమ దేవి మాదిరిగా అవసరమైతే కత్తి పట్టి పోరాటం చేయాలని మహిళ నేతలకు ఈ సందర్భంగా సూచించారు. ప్రతి మహిళ కూడా గల్లిగల్లీ తిరుగుతూ ఇంటింటికి రాజ్యాంగం గురించి అవగాహన కల్పించాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ మహిళ ఇన్ ఛార్జీలు ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు.

గాంధీ, అంబేద్కర్, జ్యోతిబా, సాయిత్రి భాయ్ లకు నివాళులు :

అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి ఈ సదస్సును కవిత ప్రారంభించారు. సదస్సులో టీఆర్ఎస్ మహిళ నేతలు మనోజ గౌడ్, వేముల భవాని, సూరారపు కృష్ణవేణి, కావేటి సవిత, సంద్ర మాలతి, పగిడాల శ్రావణి, రజియాబేగం, హలిమా బేగం, తిరుపతి పరమేశ్వరీ, లలితా యాదవ్, సౌజన్య రెడ్డి, గీత, అంశం శివరాణి, ఝాన్సీ, అనితా చౌదరి ప్రసంగించారు.

డా. బీ.ఆర్. అంబేడ్కర్‌కి ఘన నివాళి..

- నివాళి అర్పించిన మలక్ పేట్ మాల సంఘం..



హైదరాబాద్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : భారత రత్న డా.బీ.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగం రూపశిల్పి, న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త, భారతదేశం మొట్ట మొదటి కేంద్రన్యాయ శాఖ మంత్రి, అంటరానితనం, కుల వివక్ష నిర్మూల నకు, అణగారిన వర్గాలు హక్కుల కోసం ఆయన చేసిన కృషిని గౌరవించుకుంటు గురువారం ఉద యము 7:30.గం" మూసారాం బాగ్ క్రాస్ రోడ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన చారిత్రాత్మక సంద ర్భాన్ని పురస్కరిం చుకుని రాజంగ రూపకర్తకు నివాళి అర్పించారు మలక్ పేట్ మాల సంఘము ప్రతినిధులు.. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పైత్యర నర్సింగ్ రావు, చైర్మన్ పుప్పడి బల్వంత్, కార్యదర్శి అనుముల నరసింగ్ రావు, స్నాఘం సభ్యులందరు పాల్గొన్నారు..

ఏసీబీకి చిక్కిన గద్వాల టీజీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్

- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రమేష్ బాబు..



గద్వాల, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : అవినీతి తిమింగలాలపై ఏసీబీ కొరడా ఝుళిపించింది. బిల్లుల మంజూరు కోసం కాంట్రాక్టర్ వద్ద రూ.60 వేలు లంచం తీసుకుంటూ జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన టీజీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అన్నారపు రమేష్ బాబు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గద్వాల సబ్-డివిజన్ ఏడీఈగా పనిచేస్తున్న ఈయన ఫిర్యాదుదారుడు, అతని సహ-కాంట్రాక్టర్ కలిసి పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.12,62,070 బిల్లును మంజూరు చేసి, ప్రాసెస్ చేసేందుకు రూ.60,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు మహబూబ్‌నగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని తన నివాసానికి బయలుదేరిన ఏడీఈ రమేష్ బాబు, కార్యాలయ ఆవరణలో లంచం డబ్బులను తన కారు (రిజిస్ట్రేషన్ నం. ఏపీ 07 సిజెడ్ 4705) డ్యాష్‌బోర్డుపై పెట్టాలని ఫిర్యాదుదారుడికి సూచించారు. బాధితుడు ఆ మొత్తాన్ని డ్యాష్‌బోర్డుపై ఉంచగానే, అప్పటికే మాటువేసిన మహబూబ్‌నగర్ ఏసీబీ అధికారులు దాడి చేసి రమేష్ బాబును అదుపులోకి తీసుకున్నారు. కారు డ్యాష్‌బోర్డుపై నిర్వహించిన రసాయన పరీక్షల్లో పాజిటివ్ రావడంతో పాటు, నిందితుడి వద్ద నుంచి రూ.60 వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఏడీఈని అరెస్టు చేసి, నాంపల్లిలోని 1వ అదనపు స్పెషల్ జడ్జి ఎదుట రిమాండ్ నిమిత్తం హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచారు.

లంచం అడిగితే 1064కు కాల్ చేయండి: ఏసీబీ.. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే భయపడకుండా చట్టపరమైన చర్యల కోసం ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. వాట్సాప్:9440446106 ఫేస్‌బుక్: తెలంగాణ ఏసీబీ ఎక్స్ (ట్విట్టర్) : తెలంగాణ ఏసీబీ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఏసీబీ క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి కూడా ఫిర్యాదుచేయవచ్చు.ఫిర్యాదుదారులవివరాలుపూర్తిగాగోప్యంగా ఉంచబడతాయి.

పౌల్ట్రీ లిట్టర్‌తో రూ.86,400 కోట్ల ఆదా సాధ్యం

- పౌల్ట్రీ ఇండియా 2 వ రోజు ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న పొన్నాల లక్ష్మయ్య..
- యూరియా వాడకం బదులుగా పౌల్ట్రీ పెంటను వాడటం మేలు..
- వెల్లడించిన మాజీ మంత్రి పొన్నాల..



హైదరాబాద్ నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : దేశంలో ఎరువుల సబ్సిడీ భారాన్ని తగ్గించేందుకు పౌల్ట్రీ లిట్టర్‌ను సేంద్రియ ఎరువుగా విస్తృతంగా వినియోగించాలని పౌల్ట్రీ లెజెండ్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత పొన్నాల లక్ష్మయ్య సూచించారు. పౌల్ట్రీ ఫారాల్లో ఏటా ఉత్పత్తయ్యే 796 లక్షల టన్నుల ఎండిన లిట్టర్‌ను సమర్థంగా వినియోగిస్తే, యూరియా సబ్సిడీలో రూ.47,760 కోట్ల వరకు ఆదా చేసే అవకాశం ఉందన్నారు. కొత్త యూరియా కర్మాగారాల నిర్మాణానికి అవసరమయ్యే పెట్టుబడిని కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం రూ.86,400 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేశారు. 18వ పౌల్ట్రీ ఇండియా ప్రదర్శన సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. పౌల్ట్రీలిట్టర్‌ను వ్యర్థంగా కాకుండా విలువైన సేంద్రియఎరువుగా గుర్తించి జాతీయ పంట పోషక నిర్వహణ విధానాల్లో భాగం చేయాలని కోరారు. లిట్టర్ శుద్ధి, గుళికల తయారీ, రైతులకు సరఫరా వంటి అంశాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. దేశీయ పౌల్ట్రీ పరిశ్రమ నాలుగు దశాబ్దాల్లో ఇరవై రెట్లకు పైగా వృద్ధి సాధించిందని, ప్రస్తుతం ఏటా భారీ మొత్తంలో సేంద్రియ పోషక వనరు అందుబాటులో ఉందని తెలిపారు. పౌల్ట్రీ లిట్టర్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఎరువుల దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, ప్రభుత్వ ఖజానాకు గణనీయమైన ఆదా చేకూర్చవచ్చన్నారు ఈ క్రమంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్, ట్రెజరర్,ఏం శ్రీకాంత్, సెక్రటరీ నటరాజన్ పాల్గొన్నారు..

రోబోటిక్, కీహోల్ సర్జరీలతో జీర్ణకోశ వ్యాధులకు మెరుగైన చికిత్స

- త్వరగా కోలుకునే అవకాశం.. - అధునిక శస్త్రచికిత్సలతో రోగులకు ప్రయోజనం



హన్మకొండ, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : అధునాతన లాపరోస్కోపిక్ (కీహోల్), రోబోటిక్ సర్జరీలతో వివిధ జీర్ణకోశ వ్యాధులకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు, రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉందని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లాపరోస్కోపిక్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ వై. శ్రీమన్నారాయణ తెలిపారు.కాలేయం, క్లోమం, పిత్తాశయం, చిన్న ప్రేగు, పెద్ద ప్రేగులకు సంబంధించిన వ్యాధుల చికిత్సలో ఈ ఆధునిక శస్త్రచికిత్సా విధానాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. సంప్రదాయ ఓపెన్ సర్జరీతో పోలిస్తే చిన్న కోతలతో అపరేషన్ నిర్వహించడం వల్ల నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు ఆసుపత్రిలో ఉండే సమయం కూడా తగ్గుతుందని వివరించారు. రోబోటిక్ సర్జరీ ద్వారా మరింత ఖచ్చితత్వం, మెరుగైన నియంత్రణతో సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఊబకాయంతో బాధపడేవారికి చేసే బేరియాట్రిక్ సర్జరీలను సైతం ఈ ఆధునిక విధానాల ద్వారా నిర్వహించవచ్చని వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, ఆధునిక లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలతో సంక్లిష్టమైన జీర్ణకోశ సమస్యలకు మెరుగైన చికిత్స అందించడం సాధ్యమవుతోందని, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి తగిన శస్త్రచికిత్సా విధానాన్ని ఎంపిక చేసి మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని తెలిపారు.

బస్‌భవన్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- రాజ్యాంగ విలువలను విధి నిర్వహణలో ప్రతిబింబించాలి
- ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన ఈడీలు వెంకన్న,రాజశేఖర్



హైదరాబాద్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సమానత్వపు విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలను నిత్యజీవితంలోనూ, విధి నిర్వహణలోనూ ఆచరణలో పెట్టాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సీహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అయన స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బస్‌భవన్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు.. 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన చారిత్రక సందర్భానికి గుర్తుగా ఏటా నవంబర్ 26న దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా బస్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) సీహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్ పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ అందించిన సేవలను, దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. వెంకన్న మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని పేర్కొన్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నాలుగు ప్రధాన ఆదర్శాలు రాజ్యాంగానికి ప్రాణాధారాలని వివరించారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు, అది నిర్దేశించిన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ప్రజలకు సేవలందించే సమయంలో రాజ్యాంగ స్ఫూర్తిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో నిష్పాక్షికత, పారదర్శకత, చట్టబద్ధత, జవాబుదారీతనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సంస్థ ప్రతిష్టను పెంపొందించేలా ప్రతి ఉద్యోగి తన విధులను నిర్వర్తించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు వారి విధి బాధ్యతలను రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం అవసరమని తెలిపారు. రాజ్యాంగ విలువలు కేవలం ప్రసంగాలకే, ప్రతిజ్ఞలకే పరిమితం కాకుండా కార్యాలయాల నిర్వహణలో, పరిపాలనా నిర్ణయాల్లో, ప్రజలకు అందించే సేవల్లో స్పష్టంగా ప్రతిబింబించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈడీలు సీహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్ బస్‌భవన్‌లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన ఆశయాలు, ఆదర్శాలను గౌరవిస్తూ దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం ఉషాదేవి, సీఎంఈ జానీరెడ్డి, సీటీఎం శ్రీదేవి, ఎస్ఎల్ఓ కిరణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం బస్‌భవన్‌లో రాజ్యాంగ విలువల పట్ల అవగాహన, బాధ్యతాయుత విధి నిర్వహణ ఆవశ్యకతను మరోసారి గుర్తుచేసింది.

సి - డాక్‌తో ఓం కోర్టెక్స్, ఓరోస్టార్ లాబ్స్ కీలక ఒప్పందం..

- దేశవ్యాప్తంగా 112 సేవల అనుసంధానం..
- మీడియా రంగంలో సరికొత్త విప్లవానికి సన్నాహాలు..
- జనరల్ మగేశ్ ఎతిరాజన్, రవీంద్రనాథ్ బొల్లినేని సంయుక్తంగా చెన్నైలో ఒప్పందం..
- కార్యక్రమంలో పాల్గొన్న ఓం కోర్టెక్స్ సీఈఓ ప్రవీణ్ పాతూరి..



హైదరాబాద్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : భారత దేశంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ప్రజాసేవల విస్తరణ దిశగా కీలక ముందడుగు పడింది. బ్రిటన్‌కు చెందిన ఓం సివిక్ ఇంటెలిజెన్స్, దాని భారతీయ భాగస్వామ్య సంస్థ ఓరోస్టార్ లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థ సి - డాక్‌తో కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ డైరెక్టర్ జనరల్ మగేశ్ ఎతిరాజన్, ఓరోస్టార్ ల్యాబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రనాథ్ బొల్లినేని , ఓం కోర్టెక్స్ కంపెనీ సీఈఓ ప్రవీణ్ పాతూరి చెన్నైలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా దేశవ్యాప్తంగా 112 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్‌ను ఓం కోర్టెక్స్ డిజిటల్ వ్యవస్థతో అనుసంధానించనున్నారు. పోలీసు, అగ్నిమాపక, వైద్య అత్యవసర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ సాంకేతిక అనుసంధానం దోహదపడనుంది. దీంతో పాటు సూపర్ కంప్యూటింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, సైబర్ ఫోరెన్సిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, స్మార్ట్ సెన్సర్లు, 5జీ టెక్నాలజీ, ఈ-గవర్నెన్స్ తదితర అత్యాధునిక సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి ఒప్పందం కుదిరింది. ఉమ్మడి పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, నూతన ఉత్పత్తుల రూపకల్పన, సాంకేతిక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కూడా ఈ ఒప్పందంలో భాగంగ

కడ్తాల్‌లో రాజ్యాంగ దినోత్సవ సందడి

- అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యం
- అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సంవిధాన్ దివస్ వేడుకలు
- రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు ఘన నివాళి



కడ్తాల్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : భారత రాజ్యాంగం ఆమోదం పొంది 77వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సంఘం నాయకులు,కమిటీ సభ్యులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులు,స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం,సౌభ్రాతృత్వం వంటి గొప్ప విలువలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను,దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం పోషిస్తున్న కీలక పాత్రను నాయకులు గుర్తు చేసుకున్నారు. కుల,మత,ప్రాంత,భాషా భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప ప్రజాస్వామ్య పునాదే భారత రాజ్యాంగమని పేర్కొన్నారు.అణగారిన వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా,విద్యాపరంగా సముచిత అవకాశాలు కల్పించడంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు ప్రతి పౌరుడు తన బాధ్యతలను కూడా గుర్తెరిగి నడుచుకోవాలని పిలుపునిచ్చారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా వాటిని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని,సమాజంలో వివక్షకు తావులేకుండా సమానత్వం, సోదరభావం,సామాజిక న్యాయం పరిఢవిల్లినప్పుడే రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరుతాయని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా యువత రాజ్యాంగంపై అవగాహన పెంచుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుకలు రాజ్యాంగ పరిరక్షణ,సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పట్ల ప్రజల్లో చైతన్యం నింపేలా కొనసాగాయి.రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కంబాలపల్లి అంజి,గౌరవ అధ్యక్షుడు సిద్దిగారి వెంకటేష్, సాంస్కృతిక కార్యదర్శి కళ్ళ అంజి,కమిటీ సభ్యులు కంబాలపల్లి శ్రీకాంత్,గురిగళ్ళ కృష్ణ,కాలే శ్రీను,కొప్పు కుమార్,పోతగల్ల సాయి,సిద్ధిగారి కుమార్,గురిగళ్ళ వీర రాఘవులు,మంకి వెంకటేష్,తుప్పరి శ్రీను,కాలే అంజయ్య,తుప్పరి మహేష్,కొప్పు శివ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా వివిదరాజకీయ పార్టీల నాయకులు బాచి రెడ్డి రవీందర్ రెడ్డి,ఎగిరిశెట్టి కరుణాకర్,దోనాదుల మహేష్,నింగ్యాని యాదగిరి,కంటేకర్ భగీరత్, ప్రేమ్ కుమార్,శ్యాం కుమార్,అంజయ్య తదితరులు పాల్గొని రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు సంఘీభావం తెలిపారు.

సబితా ఇంద్రారెడ్డి,కార్తీక్ రెడ్డిల సహకారాన్ని మరిచిపోయారా?

- వివక్ష గురించి మాట్లాడే ముందు అభివృద్ధిపై సమాధానం చెప్పండి!
- అభివృద్ధిపై చర్చకు సిద్ధం.. ఎమ్మెల్యే బహిరంగంగా సమాధానం చెప్పాలి.
- హామీల అమలులో వైఫల్యం.. అభివృద్ధి పనుల్లో జాప్యం.. పదవుల కేటాయింపులోనూ వివక్షేనా?
- మాజీ ఎంపీపీ ధర్మన్నగాల గోవర్ధన్ రెడ్డి ఘాటు విమర్శలు



శంకర్‌పల్లి, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : వివక్ష గురించి ఎమ్మెల్యే మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని,నిధుల కేటాయింపులోనే కాకుండా రాజకీయంగా,పదవుల పంపిణీలోనూ వివక్ష చూపుతున్నారని మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శంకర్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే తీరుపై పలు ప్రశ్నలు సంధించారు.మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురించి మాట్లాడే ముందు గతంలో ఆమె చేసిన రాజకీయ సహకారాన్ని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.సబితా ఇంద్రారెడ్డి,కార్తీక్ రెడ్డి ఎన్నికల సమయంలో సహకరించకపోయి ఉంటే ఎమ్మెల్యే గెలుపు సాధ్యమయ్యేదా?అని ప్రశ్నించారు.రాజకీయంగా అండగా నిలిచిన వారి మేలును మరిచి వారిపైనే విమర్శలు చేయడం తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టినట్లుగా ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం...అభివృద్ధి చేశాకే విమర్శలు చేయాలి!

అభివృద్ధి కోసమే పార్టీ మారామని చెప్పుకునే ఎమ్మెల్యే..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను తమ ఖాతాలో వేసుకోవడం కాకుండా,ప్రస్తుత ప్రభుత్వంలో కొత్తగా చేసిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టంగటూరు బ్రిడ్జికి ఇప్పటికీ కనెక్టివిటీ రోడ్డు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.శంకర్‌పల్లి-మోమిన్‌పేట్,పర్వేద-అంతప్ప గూడ ,దోబీపేట్-గాజులగూడ,చందిప్ప తదితర గ్రామాల ప్రధాన రహదారుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.రోడ్లపై ప్రయాణించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు లేరని మండిపడ్డారు.కేవలం శాంక్షన్ లెటర్లకే పరిమితమవుతున్నారని,క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదని విమర్శించారు.రహదారుల దుస్థితితో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు.

ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.
- మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం ఏమైంది?
- పెంచుతామన్న పింఛన్ల హామీ ఏమైంది?
- కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఎక్కడ?
- రైతులకు రైతు బీమా, రైతు భరోసా పరిస్థితి ఏమిటి?
- రైతు భరోసా ఎన్ని విడతల్లో అందించారు?
- బతుకమ్మ చీరల పంపిణీ ఏమైంది?
- రంజాన్ తోఫా పథకం ఏమైంది?

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇతరులపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పదవుల కేటాయింపులోనూ వివక్షేనా?

కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన నాయకులు,కార్యకర్తలను పక్కనపెట్టి నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా ఎమ్మెల్యే తన రాజకీయ వివక్షను బయటపెట్టారని విమర్శించారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన వారికి గుర్తింపు ఇవ్వకుండా,కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత కల్పించడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొందన్నారు.

అభివృద్ధిపై...బహిరంగ చర్చకు సిద్ధం!

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురించి మాట్లాడితే తాము కూడా గత రాజకీయ పరిణామాలు,అభివృద్ధి పనులు, ఎన్నికల హామీలు,పదవుల పంపిణీపై ఇంకా చాలా విషయాలు మాట్లాడాల్సి వస్తుందని ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు.వివక్ష గురించి మాట్లాడే ముందు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి,ప్రస్తుత ప్రభుత్వంలో చేపట్టిన పనులు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఎమ్మెల్యే బహిరంగంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి విషయంలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.రాజకీయ విమర్శలు పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి..అభివృద్ధిని చేతల్లో చూపించండని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.వాసుదేవ్ కన్నా,బిసోళ్ల శ్రీధర్,జంగయ్య బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆమనగల్ మార్కెట్ కమిటీ పాలక మండలిపై ఉత్కంఠ!

- పాడిగింపా..? కొత్త కమిటీనా..?
- ఆశావహుల్లో పెరుగుతున్న ఆశలు.. తెరపైకి పలువురు నాయకుల పేర్లు!
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపైనే ఆశావహుల ఆశలు!



కడ్తాల్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి పదవీ కాలం నవంబర్ 21తో ముగియడంతో తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుత పాలక మండలికి ప్రభుత్వం పదవీకాలం పొడిగిస్తుందా? లేక కొత్త పాలక మండలిని నియమిస్తుందా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.పదవీకాలం ముగిసి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవడంతో మార్కెట్ కమిటీ భవిష్యత్తుపై స్పష్టత కొరవడింది.ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం కోసం ప్రస్తుత పాలకవర్గ సభ్యులతో పాటు ఆశావహ నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఎమ్మెల్యే నిర్ణయంపైనే ఆశలు!

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మార్కెట్ కమిటీ విషయంలో తీసుకోబోయే నిర్ణయం కీలకంగా మారనుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొత్త పాలక మండలి ఏర్పాటు జరిగితే ఎవరికి అవకాశం కల్పిస్తారు? ప్రస్తుత పాలకవర్గానికే పొడిగింపు లభిస్తుందా? అనే అంశాలపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఆశావహులుగా పలువురు నాయకులు!



కొత్త మార్కెట్ కమిటీ ఏర్పాటు జరిగితే కీలక పదవులు దక్కించుకోవాలనే ఆశతో పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఈ క్రమంలో ఆమనగల్ మాజీ ఎంపీటీసీ గుర్రం కేశవులు,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,రేవంత్ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్లీకర్ చందోజీ,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్,దళిత సామాజిక నేత వస్పుల జంగయ్య తదితరుల పేర్లు ఆశావహుల జాబితాలో వినిపిస్తున్నాయి.మార్కెట్ కమిటీ పదవుల కేటాయింపులో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తారా? సామాజిక సమీకరణాలు,రాజకీయ సమతుల్యతకు పెద్దపీట వేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.మొత్తానికి ఆమనగల్ మార్కెట్ కమిటీపై ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం స్థానిక రాజకీయాల్లో కీలకంగా మారనుంది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? ప్రస్తుత పాలక మండలికి పొడిగింపు లభిస్తుందా? లేక కొత్త కమిటీకి అవకాశం కల్పిస్తారా? అన్న ఉత్కంఠకు ప్రభుత్వం ఎప్పుడు తెరదించుతుందో వేచి చూడాలి.



ప్రభుత్వ స్థలం 1450 గజాల వ్యవహారంపై అధికారుల మౌనం!

- స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
సిటీజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు



మణికొండ, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : మణికొండ జాగీరు పరిధిలోని సర్వే నంబర్ 42లో ఉన్న సుమారు 1450 గజాల విలువైన ప్రభుత్వ స్థలానికి సంబంధించిన వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ స్థలానికి సంబంధించి దస్తావేజు నంబర్ 4009/2024, రిట్ పిటిషన్ నంబర్ 25279/2026కు సంబంధించిన పూర్తి వివరాలను కోరుతూ ఈ నెల 11 ఆగస్టు 2026న సమాచార హక్కు చట్టం కింద నార్సింగి సర్కిల్ మున్సిపల్ అధికారులు, గండిపేట మండల తహసీల్దార్, శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్‌లకు దరఖాస్తులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాధానం రాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నిరసనల అనంతరం ఇటీవల ఈ స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించినప్పటికీ, ఆ సర్వేకు సంబంధించిన వివరాలను ప్రజలకు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన వివరాలకు సమాధానం ఇవ్వకుండా అధికారులు మౌనం పాటించడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల నుంచి సమాచారం రాబట్టేందుకు తదుపరి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌లకు మొదట సమర్పించిన ఆర్టీఐ దరఖాస్తులకు సంబంధించి అప్పీళ్లు దాఖలు చేసినట్లు ది సిటీజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు తెలిపారు. అప్పీళ్ల ద్వారా దస్తావేజు నంబర్ 4009/2024కు సంబంధించిన వివరాలతో పాటు రిట్ పిటిషన్ నంబర్ 25279/2026కు సంబంధించిన పూర్తి సమాచారం వెలుగులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పారదర్శకంగా వ్యవహరించి కోరిన సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో న్యాయం కోసం సంబంధిత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

ఓల్డ్ మల్కాజిగిరిలో బోర్‌వెల్‌కు మహర్దశ

- 60 వేల వ్యయంతో నూతన మోటార్, పంపుసెట్ ఏర్పాటు
పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ శ్రవణ్



మల్కాజిగిరి, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంత ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి దేవాలయం పక్క సందులోని మరమ్మతులకు గురైన పవర్ బోర్‌వెల్ పనులను మాజీ కార్పొరేటర్ శ్రవణ్ గురువారం పరిశీలించారు. ఇటీవల బోర్‌వెల్ పాడైపోవడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, బోర్‌వెల్‌కు మరమ్మతులు చేపట్టాలని గతంలో వాటర్ వర్క్స్ అధికారులను శ్రవణ్ కోరారు. ఆయన విజ్ఞప్తికి స్పందించిన అధికారులు సుమారు 60 వేల వ్యయంతో నూతన మోటార్, పంపుసెట్‌ను ఏర్పాటు చేసి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించిన శ్రవణ్ వాటర్ వర్క్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బోర్‌వెల్‌ల మరమ్మతులు, నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను కోరారు. అదేవిధంగా భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముందుకు రావాలని, అధికారులు కూడా ప్రజల్లో అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జైకృష్ణ, నవీన్ యాదవ్, జోగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ జీవిత బీమా నమోదు ప్రక్రియ



పెద్ద అంబర్‌పేట్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : పెద్ద అంబర్‌పేట్ డివిజన్, కుంట్లూర్ గ్రామపంచాయతీ కార్యాలయం లో ఇందిరమ్మ జీవిత బీమా పథక నమోదు కార్యక్రమం రెండు రోజులుగా కొనసాగుతున్నది, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీవిత బీమా పథకానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తున్నది అని, స్థానిక అధికారులు ఇంకా అవగాహన కల్పించాల్సి ఉన్నదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఓరుగంటి కొండల్ గౌడ్ తెలిపారు, ఈ కార్యక్రమంలో డిసిగ్నేటివ్ ఆఫీసర్ మాతృనాయక్, ఇన్చార్జి ఆఫీసర్ సరోజ మరియు ఆపరేటర్ పునీత్ పాల్గొన్నారు

రాజ్యాంగ విలువలను చాటిన విద్యార్థులు

- ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్‌లో ఘనంగా సంవిధాన్ దివస్
- పార్లమెంట్ సభ్యులుగా విద్యార్థుల పాత్రధారణ
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశంతో ప్రజాస్వామ్య స్ఫూర్తి



కడ్తాల్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పార్లమెంట్ సభ్యులుగా పాత్రలు పోషిస్తూ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు.పార్లమెంట్ సభ్యుల వేషధారణలో సభలో పాల్గొన్న విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు,రాజ్యాంగం కల్పించిన హక్కులు,పౌరుల బాధ్యతలు, దేశాభివృద్ధి తదితర అంశాలపై ఆసక్తికరంగా చర్చించారు.పార్లమెంట్ సమావేశాల నిర్వహణ, చట్టాల రూపకల్పన విధానాన్ని తమ పాత్రల ద్వారా ప్రదర్శించి ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు,విధులు, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక సూత్రాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,ఆత్మవిశ్వాసం,వక్తృత్వ నైపుణ్యాలు,సామాజిక బాధ్యతను పెంపొందించే ప్రయత్నం చేశారు.కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్,ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులను అభినందించారు.విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనతో పాఠశాల ప్రాంగణం దేశభక్తి, ప్రజాస్వామ్య స్ఫూర్తితో సందడిగా మారింది.

ద్వారకామాయి కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కీసర, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని గోధుమ కుంటద్వారకామాయి కాలనీలో మెయిన్ రోడ్డు నుంచి శివసాయి కాలనీ వరకు సుమారు రూ.23 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రోడ్డు మంజూరుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులు మాంచాల ప్రవీణ్ కుమార్, నాగారం ప్రెసిడెంట్‌లకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షురాలు హెచ్. సుమతి, మాజీ వార్డు మెంబర్ శేఖర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- సంవిధాన్ రక్షక్ ర్యాలీలో మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



జవహర్ నగర్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : రాజ్యాంగాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు.ఏఐసీసీ పిలుపు మేరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన సంవిధాన్ రక్షక్ ర్యాలీలో మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు ముదిరాజ్, సీనియర్ నాయకులు రజిత గోపాల్, ఉపాధ్యక్షుడు గోనె చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జోగి సునీత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, నాయకులు సాయి కృష్ణ (మిట్టు), కాలేశా, రామిరెడ్డి, నర్ర మహేష్, భాస్కర్ గౌడ్, రాము, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ రక్షా మార్చ్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కుత్బుల్లాపూర్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సంవిధాన్ రక్షా మార్చ్‌లో కుత్బుల్లా పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి,టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి లు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు.లిబర్టీ సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ మార్చ్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బి.ఎం. సందీప్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ,ఐఎన్ టి యుసి,ఎన్ఎస్ యుఐ, నాయకులు,కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- డిసెంబర్ 5లోగా స్టేడియం అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- క్రీడాకారులకు వసతి, భోజనం, వైద్య సదుపాయాలు కల్పించాలి.. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : డిసెంబర్ 18 నుంచి 22 వరకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యువ క్రీడల అథ్లెటిక్స్ పోటీలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్టేడియంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. స్టేడియంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ డిసెంబర్ 5వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు.పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య సేవలను కూడా పకడ్బందీగా అందుబాటులో ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా మార్నింగ్ వాక్

- అదాలత్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగిన పాదయాత్ర
- అంబేద్కర్ విగ్రహానికి నివాళులు.. రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివిన ఉద్యోగులు



హనుమకొండ, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వరంగల్ జిల్లా వర్కింగ్ ఎంప్లాయిస్, రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘాల ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హనుమకొండలోని అదాలత్ సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర వరంగల్ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు, పౌరుల కర్తవ్యాలను గౌరవిస్తూ ముందుకు సాగుదామంటూ నినాదాలు చేస్తూ ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. నీలిరంగు కండువాలు ధరించి, ప్లకార్డులు, బ్యానర్లు చేతబూని పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులంతా కలిసి భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను పరిరక్షించుకుంటూ, బాధ్యతాయుతమైన పౌరులుగా తమ కర్తవ్యాలను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఎల్లప్పుడూ కాపాడుతామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై వెలిసింది బొమ్మ కాదు.. గుండెల నిండా అభిమానం!

- ఉర్సు హరిజనవాడలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కొండా సురేఖ
- లబ్ధిదారులైన స్వర్ణలత - అన్వేష్ దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు



వరంగల్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : ఏళ్ల తరబడి సొంత ఇల్లు లేక గుడిసెల్లో జీవిస్తున్న నిరుపేదల ఇంటి కలను సాకారం చేసే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ పేర్కొన్నారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 41వ డివిజన్ ఉర్సు హరిజనవాడకు చెందిన గాదె స్వర్ణలత–అన్వేష్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా దంపతులకు నూతన వస్త్రాలు బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. సొంతింటి కల నెరవేరిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్ భవన్ లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) సిహెచ్.వెంకన్న, ఎం.రాజశేఖర్









హైదరాబాద్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్ భవన్ లో గురువారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రతి ఏటా నవంబర్ 26న దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా బస్ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) సిహెచ్.వెంకన్న,ఎం.రాజశేఖర్ పాల్గొని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఈడీ సిహెచ్.వెంకన్న మాట్లాడుతూ..న్యాయం,స్వేచ్ఛ,సమానత్వం,సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ మౌలిక ఆదర్శాల ప్రాధాన్యతను వివరించారు.అధికారులు,ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రతి సందర్భంలోనూ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ,రాజ్యాంగం నిర్దేశించిన విలువలను ఆచరణలో పెట్టాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు సేవలందించే క్రమంలో రాజ్యాంగ సూత్రాలు, చట్టబద్ధమైన విధానాలు, నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తూ రాజ్యాంగ వ్యవస్థకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు.రాజ్యాంగ విలువలను కేవలం సిద్ధాంతాలకే పరిమితం చేయకుండా పరిపాలనా నిర్ణయాల్లోనూ ఆచరణాత్మకంగా అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఈడీ వెంకన్న ఉద్యోగులందరితో భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకల్లో సిపిఎం ఉషాదేవి,సీఎంఈ జానీరెడ్డి, సిటీఎం శ్రీదేవి, ఎస్ఎల్ఓ కిరణ్ తదితర ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ కాటాపూర్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు
- క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు.. విజేతలకు బహుమతుల ప్రదానం



తాడ్వాయి, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : తాడ్వాయి మండలం కాటాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు భూక్య సక్రు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేందుకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల సిబ్బంది కార్యదర్శి సుతారి పాపారావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయపాల్, రాజేష్, మోహన్, శ్రీదేవి తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఆదాయపు పన్ను శాఖ డీజీ రాజర్షి ద్వివేది

- కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారిప్రత్యేక పూజలు..
- వేదపండితుల ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదాల అందజేత



వరంగల్, నవంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) : వరంగల్ మహానగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని గురువారం ఉదయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్ రాజర్షి ద్వివేది, ఐఆర్ఎస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన వెంట శ్రీకాంత్ రెడ్డి, ఐఆర్ఎస్ కూడా ఉన్నారు.ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వరరావు, కమటం వేణుగోపాల్, కారెంగు సురేష్‌బాబు, వల్లూరి పవన్‌కుమార, చిదురాల అంజనీదేవి, మాడిశెట్టి నతీష్, రమేష్ చంద్ భంగ్, పేరాల శ్రీనివాసరావుతో పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా రాజర్షి ద్వివేది అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ మహామండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించారు. అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత వెల్లడించారు.

30,1 తేదీల్లో పింఛన్ల పంపిణీ



❍ మారిన పింఛన్ల షెడ్యూల్ ప్రకారం పంపిణీ జరగాలి

గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించిన మేరకు సామాజిక భద్రత పింఛన్లను నవంబరు 30, డిసెంబరు 1వ తేదీల్లో మాత్రమే పంపిణీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పింఛను సొమ్మును విత్ డ్రా చేయుటకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీ షెడ్యూల్ మారిన అంశం గమనించాలని స్పష్టం చేశారు. నవంబరు 30, డిసెంబరు 1వ తేదీల్లో మాత్రమే పంపిణీ చేయాలని, ఈ మేరకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు రూపొందించుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సమాచారం సక్రమంగా అందజేసి పింఛను ఆ రెండు రోజులలో తీసుకునే విధంగా చేయాలని ఆదేశించారు. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది అందరికీ స్పష్టమైన సూచనలు జారీ చేసి పర్యవేక్షించాలని అన్నారు. పంపిణీ సమయంలో యథావిధిగా నిర్దేశిత మార్గదర్శకాలు పాటించాలని చెప్పారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): పోలీసు సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి వినతిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు సిబ్బంది గ్రీవెన్స్ డేలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, డబ్ల్యూఎంఎస్కే విభాగాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసు సిబ్బంది నుంచి ఆయన వినతులు స్వీకరించారు. బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, ఇతర పరిపాలనా అంశాలపై సిబ్బంది తమ అభ్యర్థనలను సమర్పించారు. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, శాఖా నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది సమస్యలను సకాలంలో పరిష్కరించడం ద్వారా విధి నిర్వహణలో సామర్థ్యం, బాధ్యత, ఉత్సాహం పెరుగుతాయని ఎస్పీ పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతులు వంటి అంశాల్లో శాఖా నిబంధనలు, ఖాళీలు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే సిబ్బంది సంక్షేమానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం, భద్రతాభావాన్ని పెంపొందించాలని సూచించారు. పోలీసు శాఖ ఒక కుటుంబమని, పరస్పర సహకారం, సమన్వయం, గౌరవంతో పనిచేస్తే శాఖ మరింత బలోపేతమవుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

కూటమితో రాష్ట్ర సమగ్రాభివృద్ధి : ఎమ్మెల్యే నసీర్

❍ ప్రపంచ స్థాయిలో అమరావతి రాజధాని నిర్మాణం

❍ సూపర్ సిక్స్, తల్లికి వందనం, దీపం పథకాలపై ప్రజల్లో విశేష ఆదరణ

❍ మైనారిటీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కృషి

❍ చీరాల, పెదకాకానిలో ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల ప్రచారం



గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో ఎమ్మెల్యే కొండయ్య, పొన్నూరు నియోజకవర్గం పరిధిలోని పెదకాకాని మండలంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న చారిత్రాత్మక పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తూ తల్లుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులు మళ్లీ పట్టాలెక్కాయని తెలిపారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, తద్వారా యువతకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తున్నాయని చెప్పారు. మైనారిటీ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి రుణాలు, విద్యార్థులకు విదేశీ విద్యా పథకం, షాదీఖానాల నిర్మాణం, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల చెల్లింపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు.

వరల్డ్ మేయర్స్ ఫోరం వేదికగా సిటీ నెట్ ప్రతినిధులతో గుంటూరు కమిషనర్ భేటీ



గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): ముంబైలో నిర్వహిస్తున్న 3వ వరల్డ్ మేయర్స్ ఫోరం సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ సిటీనెట్ ప్రతినిధులతో సమావేశమై పట్టణాభివృద్ధి, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నవంబర్ 25 నుంచి 27 వరకు ముంబైలోని ఫెయిర్‌మాంట్ హోటల్‌లో ఈ అంతర్జాతీయ ఫోరం నిర్వహిస్తున్నారు.

ఫోరం మూడో రోజు ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్, ఇతర నగరపాలక సంస్థల కమిషనర్లతో కలిసి మయూర్ అశోక్ సిటీనెట్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నగరాల మధ్య పరస్పర సహకారం, పట్టణ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛత, సుస్థిర పట్టణాభివృద్ధికి సంబంధించిన అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

ఈ అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాలకు చెందిన మేయర్లు, పట్టణ పాలనా నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొని ఆధునిక నగరాల భవిష్యత్తుపై చర్చించారు. 2047 నాటికి నగరాల రూపురేఖల మార్పు, కృత్రిమ మేధ ఆధారిత పట్టణ పాలన, సర్క్యులర్ ఎకానమీ, వాతావరణ మార్పులను తట్టుకునే నగరాల నిర్మాణం, సుస్థిర పట్టణ రవాణా, మెట్రోపాలిటన్ పాలన, ఇంధన పరివర్తన వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.

మహిళా నాయకత్వం, లింగ సమానత్వం, ఆర్థిక చేరికపై ప్రత్యేక వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించారు. అంతర్జాతీయ వేదికపై చర్చించిన ఉత్తమ విధానాలు, వినూత్న ఆలోచనలను గుంటూరు నగర అభివృద్ధికి అన్వయించుకునేందుకు కృషి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రజలకు సమర్థవంతమైన పట్టణ సేవలు అందించడంలో ఈ సమావేశాల ద్వారా లభించిన అనుభవం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను కలిసిన జిల్లా కలెక్టర్



గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఏపీ ఎస్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిని జిల్లా కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరులోని అటవీ శాఖ అతిథి గృహంలో ఈ భేటీ జరిగింది. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ క్యాంపు కోర్టు నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ కమిషన్ చైర్మన్‌ను కలిశారు. ఈ క్యాంపు కోర్టు ద్వారా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు సంబంధించిన మానవ హక్కుల ఉల్లంఘన కేసుల విచారణ చేపట్టడంతో పాటు కొత్త కేసులను స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, కమిషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

ప్రశాంతంగా ముగిసిన పొన్నూరు, మంగళగిరి-తాడేపల్లి ఎన్నికలు

❍ రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు ముమ్మరం

❍ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): పొన్నూరు మున్సిపాలిటీ, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు పటిష్ట పోలీస్ బందోబస్తు, సమన్వయంతో ప్రశాంతంగా ముగిశాయని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని శుక్రవారం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా అభినందించారు. ఎన్నికల సమయంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేశారని ఎస్పీ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు గార్డులతో పటిష్ట భద్రత కల్పించినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు భద్రతా ఏర్పాట్లను కొనసాగించాలని, కేంద్రాల పరిసరాల్లో నిరంతర గస్తీ నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా బందోబస్తు నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయంతో పనిచేసిన పోలీసు అధికారుల కృషిని ప్రశంసించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న పెదకాకాని, తెనాలి రూరల్, కొల్లిపర, పొన్నూరు రూరల్, చేబ్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు భద్రతా ప్రణాళిక రూపొందించాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అవసరమైన పోలీస్ బందోబస్తు, రూట్ మొబైల్ ఏర్పాట్లు చేపట్టాలని, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారానికి ముగింపు ఉంటుందని ఎస్పీ తెలిపారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాల్సిన ఎన్నికల నిబంధనల ప్రకారం మైకుల వినియోగం, బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇతర ప్రచార కార్యక్రమాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని భద్రతా చర్యలు చేపడుతోందని పేర్కొంటూ, ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో అనుమానాస్పద కార్యకలాపాలు లేదా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు గమనిస్తే సంబంధిత పోలీసు అధికారులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

విద్యార్థుల భవిష్యత్తుకు ఆశాజ్యోతిగా నిలిచిన మంగాదేవి సేవలు చిరస్మరణీయం

❍ బాలకుటీర్ విద్యాసంస్థల ద్వారా భావితరాలకు బలమైన పునాది

❍ ఎమ్మెల్యే గళ్ళా మాధవి నివాళి



గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు విద్యారంగంలో విశేష సేవలందించిన ప్రముఖ విద్యావేత్త, శ్రీ వెంకటేశ్వర బాలకోటి ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి సేవలు చిరస్మరణీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. చోడవరంలోని చేతన ఫౌండేషన్ ఆవరణలో శుక్రవారం మంగాదేవి కన్నుమూయడంతో ఆమె తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చోడవరంలోని చేతన ఫౌండేషన్‌కు చేరుకున్న గళ్ళా మాధవి, మంగాదేవి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

మంగాదేవి విద్యారంగంలో విశేష కృషి చేసిన వ్యక్తిగా తెనాలి ప్రాంత ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమందికి సుపరిచితురాలని గళ్ళా మాధవి పేర్కొన్నారు. తన వ్యక్తిగత జీవితం, కుటుంబ ప్రయోజనాలకే పరిమితం కాకుండా సమాజానికి, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తుకు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు విద్య ద్వారా జీవితాల్లో వెలుగులు నింపి, భావితరాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. బాలకుటీర్ విద్యాసంస్థలను లాభాపేక్ష లేకుండా విలువలు, ఆశయాలకు అనుగుణంగా నిర్వహించడం మంగాదేవి ప్రత్యేకత అని అన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని, ఆహ్లాదకరమైన విద్యావాతావరణాన్ని కల్పించాలనే సంకల్పంతో పనిచేసి, ఎంతోమంది పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. విద్యను కేవలం చదువుకే పరిమితం చేయకుండా పిల్లల ఎదుగుదలకు, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా ఆమె అనుసరించిన విధానం ఆదర్శనీయమని అన్నారు.

మంగాదేవి చూపిన మార్గం, ఆమె నెలకొల్పిన విద్యా విలువలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ బాలకుటీర్ విద్యాసంస్థలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థలను స్థాపించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలనుకునే వారు మంగాదేవి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మంగాదేవి చివరి చూపు కోసం అభిమానులు, విద్యారంగానికి చెందిన పలువురు తరలివచ్చి నివాళులర్పించడం ఆమె సమాజంలో సంపాదించుకున్న గౌరవానికి నిదర్శనమని అన్నారు. ఆమె భౌతికంగా దూరమైనా విద్యారంగానికి అందించిన సేవలు, నెలకొల్పిన విలువలు, విద్యార్థుల జీవితాల్లో వెలిగించిన జ్యోతులు చిరకాలం నిలిచిపోతాయని పేర్కొంటూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

డాక్టర్ మంగాదేవి మృతి విద్యారంగానికి తీరని లోటు



❍ ఎంపీ భాష్యం రామకృష్ణ

గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరులో గుండెపోటుతో మరణించిన శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి భౌతికకాయాన్ని రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యార్థుల పట్ల డాక్టర్ మంగాదేవికి ఉన్న అపారమైన ప్రేమ, విద్యారంగ అభివృద్ధికి ఆమె అందించిన విశేష సేవలను భాష్యం రామకృష్ణ గుర్తుచేసుకున్నారు. పిల్లల సమగ్ర వికాసం, విద్యా విలువల పెంపొందింపునకు ఆమె చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమన్నారు.

విద్యారంగంలో ఆమె నెలకొల్పిన విలువలు, అందించిన సేవలు భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. డాక్టర్ మంగాదేవి మరణం విద్యారంగానికి, సమాజానికి తీరని లోటని భాష్యం రామకృష్ణ అన్నారు.

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



గుంటూరు, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తి చేశారు. ఈ ప్రక్రియ ద్వారా ఎన్నికల విధుల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు విధులను కేటాయించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ, వివరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ జిల్లా అధికారి మోహన రాగిని పాల్గొన్నారు.

సోమిరెడ్డిపల్లె సర్పంచ్ ఏకగ్రీవం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డి పల్లె పంచాయతీ సర్పంచ్‌గా ఇటికల ప్రశాంతి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా డిక్లరేషన్ ఫారాన్ని స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పూజ ఉమాదేవి భర్త పూజా శివ యాదవ్ సీనియర్ మండల టిడిపి నాయకులు ఎస్ఆర్ శ్రీనివాసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రేఖలకుంట గ్రామపంచాయతీని అభివృద్ధి పదంలో నడిపిస్తా... పెరుగు నాగేంద్ర యాదవ్



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): రేఖలకుంట గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పెరుగు నాగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఏకగ్రీవ సర్పంచిగా డిక్లరేషన్ ఫారం తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులతో సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు ప్రజలు, మండల నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి సర్పంచ్ పదవి కి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి, పంచాయతీ పరిధిలోని నాయకుల సహకారంతో పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేస్తాను అని అన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ న్యాయం చేస్తానంటూ తెలిపారు కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ మాలేపాటి సుబ్బారావు, మాజీ మాజీ మండల ఉపాధ్యక్షులు భూతప్ప నాయుడు, గుజ్జు రామాంజనేయులు, శివ యాదవ్, వెంకటేష్ సామూరి, పెరుగు నాగేష్ యాదవ్, ఏకగ్రీవం ఎన్నికైన సర్పంచ్ తండ్రి మాజీ సర్పంచ్ పెరుగు వీరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ఎన్నిక ఏదైనా కూటమిదే విజయం



❍ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు

విజయవాడ, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): పార్లమెంట్ ఎన్నికలైనా, పంచాయతీ ఎన్నికలైనా ప్రజల మద్దతు కూటమికే ఉంటుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను పునరుద్ధరించేందుకు చేసిన కృషికి ప్రజలు ఎన్నికల్లో మద్దతు తెలిపారని పేర్కొన్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉండేవని విమర్శించారు. ప్రస్తుతం ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యబద్ధంగా తీర్పు ఇచ్చారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పార్టీని ప్రజలు రాజకీయంగా పక్కన పెట్టారని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో బీజేపీ అధ్యక్షుడు మాధవ్ నాయకత్వంలో పార్టీ విజయపథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. కూటమి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ప్రజలు అండగా నిలిచారని, కూటమి పోటీ చేసిన చోట్ల విజయాలు సాధిస్తోందని పేర్కొన్నారు.

రాజమహేంద్రవరంలోనూ కూటమి విజయం సాధించబోతోందని రమేష్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ముందుకు సాగుతోందని అన్నారు.

ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల టీటీడీ ప్రత్యేక అధికారిగా అర్జా శ్రీకాంత్ నియామకం

❍ ఢిల్లీ, కురుక్షేత్ర, రిషికేశ్, జమ్మూ ఆలయాల పర్యవేక్షణ బాధ్యతలు



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్): ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లోని టీటీడీ ఆలయాల పరిపాలన, అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనను పర్యవేక్షించేందుకు ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. న్యూఢిల్లీ, కురుక్షేత్ర, రిషికేశ్, జమ్మూలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్వహణ, భక్తుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ఆయన పర్యవేక్షించనున్నారు. అస్సాం, ఉత్తర(ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాల్లో టీటీడీకి సంబంధించిన వ్యవహారాలను కూడా సమన్వయం చేయనున్నారు. కొత్త బాధ్యతల్లో భాగంగా ప్రతి 15 రోజులకు ఒకసారి ఆయా ఆలయాలను ప్రత్యక్షంగా సందర్శించి తనిఖీ చేయనున్నారు. ఆలయాల్లో సమస్యలు, లోపాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన దిద్దుబాటు చర్యలపై సిబ్బందికి మార్గదర్శకత్వం వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమగ్ర నివేదికలను టీటీడీ ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. ఆలయాల్లో ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం నిత్య కైంకర్యాలు, సేవలు, ఉత్సవాల నిర్వహణ, తాజా పూల సరఫరా, ప్రసాద వితరణ సకాలంలో జరిగేలా పర్యవేక్షించనున్నారు. భక్తులకు సులభతర దర్శనం, క్యూలైన్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు, భద్రతా ఏర్పాట్లతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాల కల్పనపై దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమాల్లో శ్రీవారి సేవకుల సహకారాన్ని సమన్వయం చేయనున్నారు. అన్నదానం నాణ్యత, ధర్మ ప్రచార కార్యక్రమాలు, ఆర్థిక నిర్వహణ, ఈఆర్పీ నిబంధనల అమలు, హుండీ పర్యవేక్షణ, ఆలయ ఆస్తుల పరిరక్షణ, మరమ్మతులు, టెండర్ల ప్రక్రియలను కూడా పర్యవేక్షించనున్నారు. ఉత్సవాలకు సంబంధించిన ప్రతిపాదనలను కనీసం మూడు నెలల ముందుగానే సిద్ధం చేసి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసేలా చర్యలు చేపట్టనున్నారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ, సమన్వయం ద్వారా ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లోని టీటీడీ ఆలయాల్లో పరిపాలనా ప్రమాణాలను మెరుగుపరచి భక్తులకు మెరుగైన దర్శన అనుభూతిని అందించడమే ఈ నియామకం లక్ష్యంగా పేర్కొన్నారు.

ఏఈఓల జాబ్ చార్ట్ విడుదలలో ఏపీ ఎన్జీజీవో సంఘం సహకారం అభినందనీయం

❍ విద్యాసాగర్, రమణకు వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం కృతజ్ఞతలు

అమరావతి, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓ) చిరకాల సమస్య అయిన జాబ్ చార్ట్ విడుదలకు విశేష సహకారం అందించిన ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణకు రాష్ట్రవ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణు మాధవరావు ధన్యవాదాలు ప్రకటించారు. ఏఈఓల జాబ్ చార్ట్ విడుదల కోసం చేపట్టిన ప్రయత్నాల్లో మొదటి నుంచి తమకు అండగా నిలిచి, సమస్య పరిష్కారానికి మార్గదర్శకత్వం అందించడంతో పాటు ప్రభుత్వ స్థాయిలో అవసరమైన సహకారం అందించిన ఎన్జీజీవో సంఘం నాయకుల పాత్ర ప్రశంసనీయమని వేణు మాధవరావు పేర్కొన్నారు. ఏఈఓల సమస్యను తమ సమస్యగా భావించి నిరంతరం మద్దతు అందించడం వల్లే ఈ ప్రయత్నానికి సానుకూల ఫలితం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా అందించిన ప్రోత్సాహం, సహకారం తమ సంఘానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన చొరవ, సహకారం, మార్గదర్శకత్వం భవిష్యత్తులోనూ కొనసాగించాలని కోరుతూ మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డి.వేణు మాధవరావు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి, ఏపీఎన్జీజీవో సంఘం తూర్పుగోదావరి జిల్లా కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

మార్కెట్లకు చమురు సెగ.. రెండో రోజూ భారీ నష్టాలు

అమరావతి, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరగడం, భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతుండటం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై తీవ్ర ప్రభావం చూపాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 989.33 పాయింట్లు (1.17%) నష్టపోయి 83,339.26 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277.30 పాయింట్లు (1.07%) కోల్పోయి 25,607.20 వద్ద ముగిసింది.

కట్టెవరం సర్పంచ్‌గా భూమరాజు వెంకటలక్ష్మిని గెలిపించండి

కూటమి అభ్యర్థికి మద్దతుగా ఓటర్లను కోరిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): కట్టెవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి భూమరాజు వెంకటలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు కూటమి అభ్యర్థికి మద్దతు అందించాలని కోరారు.



గత ఎన్నికల్లో కూటమికి విశేష ఆదరణ చూపి అత్యధిక స్థానాల్లో విజయాన్ని అందించిన ప్రజలకు ఆలపాటి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ నియోజకవర్గంలోని కూటమి బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు గ్రామ భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్న ఆయన, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చే నాయకత్వం అవసరమన్నారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించే ప్రజాప్రతినిధులు ఎన్నిక కావాలని సూచించారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమని ఆలపాటి పేర్కొన్నారు. కట్టెవరం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే భూమరాజు వెంకటలక్ష్మికి కూటమి పూర్తి మద్దతు ప్రకటించిందని తెలిపారు.

అభ్యర్థి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, గ్రామంలోని ప్రతి కుటుంబాన్నికలుసుకుని కూటమి అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. కట్టెవరం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు భూమరాజు వెంకటలక్ష్మిని భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రాజమహేంద్రవరానికి సీఎం

అమరావతి, నవంబర్ 27 (జర్నలిస్ట్ ఫైల్) :ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. రాజమహేంద్రవరంలో జరిగే జిల్లా కోర్టు 222 ఏళ్లు, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్‌కు చేరుకుంటారు. 10.15 గంటలకు మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌కు వెళ్తారు. మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌లో 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.05 గంటల వరకు నిర్వహించే జిల్లా కోర్టు 222 సంవత్సరాలు, బార్ అసోసియేషన్ 131 సంవత్సరాల వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. రాజమహేంద్రవరంలో కార్యక్రమం ముగిసిన అనంతరం మధ్యాహ్నం 01.45 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు

టేకు వృక్షాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సాధించిన విజయం చారిత్రాత్మకం

❍ ఐదు దశాబ్దాల పరిశోధనకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం అభినందనీయం

❍ మూడు అభివృద్ధి చెందిన టేకు క్లోన్ల విడుదలకు ఐసీఎఫ్ఆర్ఈ ఆమోదం

❍ మూడు టేకు క్లోన్లకు ఆమోదం లభించడం దేశంలోనే తొలిసారి

❍ ఈ ఘనత సాధించిన ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ పరిశోనధనా విభాగం, పీసీసీఎఫ్ లను అభినందించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్

అమరావతి, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): టేకు వృక్షాభివృద్ధి రంగంలో ఏకకాలంలో మూడు మెరుగైన క్లోన్లను సృష్టించి ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సాధించిన చారిత్రాత్మక విజయంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా అటవీ శాఖ పరిశోధనా విభాగం సాగించిన నిరంతర పరిశోధనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారి ఈ అరుదైన ఘనత సాధించిన ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ పరిశోధనా విభాగం, పీసీసీఎఫ్, పరిశోధకులు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఉప ముఖ్యమంత్రివర్యులు ప్రత్యేకంగా అభినందించారు.



దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, బెంగళూరులోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ – ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా పరిశోధన చేసి అభివృద్ధి చేసిన మూడు మెరుగైన టేకు క్లోన్లకు జాతీయ స్థాయిలో ఆమోదం లభించింది. ఐసీఎఫ్ఆర్ఈ వెరైటీ టెస్టింగ్ అండ్ రిలీజ్ విధానంలో ఈ క్లోన్లను విడుదల చేసేందుకు ఆమోదించడం రాష్ట్ర అటవీ పరిశోధన రంగ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. APFD-IWST-TG-1, APFD-IWST-TG-2, APFD-IWST-TG-3 పేర్లతో రూపొందించిన ఈ మూడు టేకు క్లోన్లు ఐదు దశాబ్దాలకు పైగా సాగిన నిరంతర పరిశోధన, మొక్కల ఎంపిక, క్షేత్రస్థాయి పరీక్షలు, శాస్త్రీయ మదింపు ఫలితంగా రూపుదిద్దుకున్నాయి. ఇందులో APFD-IWST-TG-1 క్లోన్ ను మన రాష్ట్రంలోని నర్సీపట్నం అటవీ ప్రాంతంలోని గుడిమర్రిపాకలలో అభివృద్ధి చేశారు. 1972లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పరిశోధనా ప్రస్థానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ ఈ మెరుగైన టేకు క్లోన్లు భవిష్యత్తులో కలప ఉత్పాదకత పెంపునకు, రైతులు, కలప సాగుదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు దోహదపడతాయి. అదే సమయంలో శాస్త్రీయ పద్ధతుల్లో అటవీ వనరుల అభివృద్ధికి, స్థిరమైన అటవీ నిర్వహణకు ఈ పరిశోధనలు తోడ్పడతాయని ఆకాంక్షించారు. అటవీ సంపద పరిరక్షణతో పాటు, ఆధునిక పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ఐసీఎఫ్ఆర్ఈ–ఐడబ్ల్యూఎస్‌టీ శాస్త్రవేత్తలను అభినందించారు. జాతీయ స్థాయిలో దక్కిన ఈ గుర్తింపు భవిష్యత్ పరిశోధనలు, ఆవిష్కరణలకు స్ఫూర్తినిస్తుందన్నారు.

జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో ఉపాధ్యాయులకు 40 శాతం కోటా పునరుద్ధరించాలి

❍ నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

అమరావతి, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు గతంలో అమలులో ఉన్న 40 శాతం కోటాను పునరుద్ధరించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

డిగ్రీ, పీజీ, బీఈడీ వంటి ఉన్నత విద్యార్హతలు పొంది, డీఎస్సీ ద్వారా ఎంపికై రెండు మూడు దశాబ్దాలుగా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకు తగిన పదోన్నతి అవకాశాలు లేకపోవడం ఆవేదనకరమన్నారు. 1993లో జీవో నెం.302 ద్వారా ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో కల్పించిన 40 శాతం కోటాను 2008లో జీవో నెం.223 ద్వారా న్యాయపరమైన కారణాలతో తొలగించారని, అప్పటి నుంచి ఈ సమస్య పరిష్కారానికి సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

ఎయిడెడ్ లెక్చరర్లను ప్రభుత్వ సర్వీసులో విలీనం చేసేందుకు ప్రత్యేక విధానాలు, కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చట్టాలు రూపొందించిన ప్రభుత్వం, రెగ్యులర్ ఉపాధ్యాయుల పదోన్నతులకు ఎదురవుతున్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎందుకు అన్వేషించడం లేదని ప్రశ్నించారు. ఉన్నత విద్యార్హతలు, వృత్తిపరమైన శిక్షణ, దీర్ఘకాలిక బోధనానుభవం కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

నిర్దేశిత విద్యార్హతలు కలిగిన జూనియర్ అసిస్టెంట్లు, స్టోర్ కీపర్లు, స్టెనోగ్రాఫర్లు వంటి బోధనేతర ఉద్యోగులకు జూనియర్ లెక్చరర్లుగా నియామకం పొందే అవకాశం ఉన్నప్పుడు, అర్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు ఆ అవకాశం లేకపోవడం సమంజసం కాదన్నారు. 2025 నూతన రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులకు కొత్త సర్వీసు నిబంధనలు రూపొందించి జీవో నెం.35 నుంచి 40 వరకు విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

జీవో నెం.210 ద్వారా ఇంటర్మీడియట్ విద్యాశాఖలో స్థానిక కేడర్లను ఏర్పాటు చేసిన నేపథ్యంలో, గతంలో ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా పేర్కొన్న న్యాయపరమైన అంశాలను పునఃపరిశీలించి పరిష్కరించాలని కోరారు.

జీవో నెం. 223ను పునఃపరిశీలించి 40 శాతం కోటాను పునరుద్ధరించాలని, ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లోని అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను ఫీడర్ కేడర్లుగా చేర్చాలని డిమాండ్ చేశారు.

గతంలో రూపొందించిన కోటా పునరుద్ధరణ ముసాయిదాను నూతన రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా ఖరారు చేయాలని, జూనియర్ లెక్చరర్ ఖాళీలను గుర్తించి ఉపాధ్యాయుల పదోన్నతులకు అవకాశాలు కల్పించాలని సూచించారు. న్యాయపరమైన అడ్డంకుల పరిష్కారానికి సంబంధిత శాఖలతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి నిర్దిష్ట కాలపరిమితిలో చర్యలు చేపట్టాలని కోరారు.

ఇతర ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు తమ సంఘం వ్యతిరేకం కాదని, రెగ్యులర్ ఉపాధ్యాయుల వృత్తిపరమైన ఎదుగుదలకు కూడా ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం

మహిళా ఉద్యోగుల సమస్యలు, రెవెన్యూ అంశాలపై సీఎస్‌కు ఏపీ జేఏసీ అమరావతి వినతి

విజయవాడ, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్): మహిళా ఉద్యోగుల సమస్యలు, రెవెన్యూ శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కమిటీ ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను శుక్రవారం విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రతినిధులు సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ ఛైర్‌పర్సన్ ఎస్.శివకుమారి రెడ్డి, కోశాధికారి డాక్టర్ సాయి లక్ష్మి తదితర మహిళా విభాగం నాయకులను, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనా ఆంజనేయ కుమార్ (చంటి), సహాధ్యక్షుడు తాడికొండ శ్రీనివాస్ తదితర నూతన కమిటీ సభ్యులను సీఎస్‌కు పరిచయం చేశారు. అనంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పలు అంశాలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల తరహాలో



రెండేళ్ల పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సౌకర్యాలను కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న రీసర్వే కార్యక్రమంతో పాటు రెవెన్యూ ఉద్యోగులు ఇతర ప్రభుత్వ విధులను కూడా నిర్వహించాల్సి వస్తుండటంతో తీవ్ర పని ఒత్తిడి నెలకొంటోందని నాయకులు తెలిపారు. దీనివల్ల సర్వే నాణ్యత, ఖచ్చితత్వంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, రీసర్వేకు తగిన సమయం, కనీస నిధులు కేటాయించాలని కోరారు.

శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలని, గతంలో నిర్మాణాలు పూర్తయిన సుమారు 160 తహసీల్దార్ కార్యాలయాలు, 35 రెవెన్యూ డివిజన్ కార్యాలయాల భవనాలను వెంటనే సంబంధిత శాఖలకు అప్పగించి వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. బిల్లులు, బడ్జెట్ విడుదలలో జాప్యం తదితర కారణాలతో కొన్ని భవనాలు అధికారికంగా అప్పగించక నిరుపయోగంగా ఉన్నాయని, భారీ వర్షాలు, తుఫానుల కారణంగా పాత కార్యాలయాలు మరింత దెబ్బతింటున్నాయని వివరించారు. ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల భద్రతకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపినట్లు ఏపీ జేఏసీ అమరావతి నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ సంఘం కార్యదర్శి సీహెచ్ సురేష్ బాబు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ, మహిళా విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.అనూష లత, కో–ఛైర్‌పర్సన్ కే.నీలిమ, వైస్ ఛైర్‌పర్సన్ సీహెచ్ హర్షిత, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సాహితీ, ఏపీ జేఏసీ అమరావతి నాయకులు ఆర్.శ్రీనివాసరావు, రవి ప్రసాద్, జేవీ అనుదీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల భద్రతే ముఖ్యం



అమరావతి, నవంబర్ 27(జర్నలిస్ట్ ఫైల్) : మత్స్యకారుల ప్రాణరక్షణ, కుటుంబాల భద్రత ప్రభుత్వ ప్రాధాన్యమని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తుఫాను హెచ్చరికలు, ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మత్స్యకారుల భద్రత, ట్రాన్స్‌పాండర్ల ఏర్పాటు, బోట్ల ఫిట్‌నెస్, బీమా సౌకర్యాలపై విజయవాడ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. తుఫానులు, విపత్కర పరిస్థితుల్లో మత్స్యశాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, ఆర్టీజీఎస్ జారీ చేసే హెచ్చరికలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమన్నారు. చేపల వేటకు వెళ్లే ముందు ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని పాటించాలని, భద్రతపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

రాష్ట్రంలోని సుమారు 80 శాతం బోట్లకు ట్రాన్స్‌పాండర్లు అమర్చినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన బోట్లకు త్వరితగతిన ఏర్పాటు చేయాలని, ఇప్పటికే అమర్చిన పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా బోట్ల ఫిట్‌నెస్, భద్రతా పరికరాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, ట్రాన్స్‌పాండర్ల ఏర్పాటు, పనితీరుపై నివేదిక సమర్పించాలని మత్స్యశాఖ కమిషనర్‌ను సూచించారు. అర్హులైన ప్రతి మత్స్యకారుడికి బీమా రక్షణ కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు అమలు చేస్తున్న బీమా పథకాల పరిధిలో అర్హులందరినీ చేర్చాలని ఆదేశించారు. సముద్ర మత్స్యకారులతో పాటు మత్స్య అనుబంధ రంగాల్లో పనిచేసే అర్హులైన కార్మికులకు కూడా బీమా ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలు లేదా భద్రతా నిబంధనల అమలులో వైఫల్యం కారణంగా ప్రాణనష్టం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. మత్స్యకారుల ప్రాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని, అధికారులు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com